TGTEL/26/A2635

వాస్తవాలు పలుకు DD9 వార్త

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి: 01 | సంచిక: 49 | 01-07-2026 బుధవారం | పేజీలు: 08 | వెల: 3/-


## తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయాలి



03






## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ఏబీవీపీ ఆందోళన.. ఉద్రిక్తత

- ఉన్నత విద్యామండలి కార్యాలయం ముట్టడికి ఏబీవీపీ యత్నం
- పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్
- కార్యాలయంలోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించిన కార్యకర్తలు
- అడ్డుకున్న పోలీసులు.. ఇరువర్గాల మధ్య తోపులాట
- ఆందోళనకారులను చెదరగొట్టేందుకు లాఠీచార్జి
- కార్యాలయం వద్ద భారీగా మోహరించిన పోలీసు బలగాలు



**హైదరాబాద్, (డిడి9 వార్త):** ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మిగతా 2లో..

## సింధూ జలాలపై మళ్లీ పాక్ బెదిరింపులు

- నీటి వాటా అడ్డుకుంటే తీవ్ర పరిణామాలంటూ పాక్ హెచ్చరిక
- సింధూ జలాల నియంత్రణకు భారత్ ప్రయత్నిస్తోందన్న ముసాదిక్ మాలిక్
- పాక్‌లోకి ఒక్క చుక్క నీరు కూడా రాకుండా చేస్తున్నారంటూ ఆరోపణ
- మా నీటి హక్కులను కాపాడుకుంటామని స్పష్టం చేసిన ఇస్లామాబాద్
- సింధూ జలాల ఒప్పందం చట్టబద్ధంగానే అమల్లో ఉందన్న తరార్
- భారత్ ఏకపక్షంగా ఒప్పందాన్ని రద్దు చేయలేదని పాక్ వాదన
- పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఒప్పందాన్ని నిలిపివేసిన భారత్



02

# రైతు భరోసాపై రేవంత్‌కు కేటీఆర్ సవాల్

- 30 నెలల్లో రూ.30 వేల కోట్ల రైతు భరోసా ఎగ్గొట్టారని ఆరోపణ
- రైతు భరోసా విడుదలను సభగా మార్చి ప్రచారం చేసుకుంటున్నారని విమర్శ
- నాలుగుసార్లు రైతు భరోసా చెల్లింపులు నిలిపివేశారని కేటీఆర్ ఆరోపణ
- రుణమాఫీ, యూరియా కొరతపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీత
- రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపాటు
- పీఆర్ స్టంట్లతో రైతులను మభ్యపెట్టే ప్రయత్నమని వ్యాఖ్య
- కేసీఆర్ హయాంలో రూ.73 వేల కోట్ల రైతుబంధు అందించామని గుర్తుచేసిన కేటీఆర్
- రైతు వ్యతిరేక విధానాలను అన్నదాతలు క్షమించరని హెచ్చరిక



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి రైతు భరోసా నిధులను విడుదల చేయనున్న నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమం జరగనున్న వేళ, సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వంపై వరుస ఆరోపణలు చేశారు. గత 30 నెలల పాలనలో దాదాపు రూ.30 వేల కోట్ల రైతు భరోసా నిధులను ప్రభుత్వం రైతులకు అందకుండా ఎగ్గొట్టిందని కేటీఆర్ ఆరోపించారు. రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేయాల్సిన నిధులను విడుదల చేయకుండా, ఇప్పుడు సభల పేరుతో ప్రచారం చేసుకోవడం సరికాదని విమర్శించారు. రైతులు ఇబ్బందులు మిగతా 2లో..

# రైతులకు కాంగ్రెస్ రూ.29,300 కోట్లు బాకీ

- మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శ
- రైతు ఆశీర్వాద సభ కాదు.. రైతు వంచన సభ అంటూ మండిపాటు
- రైతు భరోసా పేరుతో రైతులను ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపణ
- ఎకరానికి రూ.15 వేలిస్తామని చెప్పి రూ.12 వేలే ఇచ్చారని మండిపాటు
- ఒక పంట సీజన్‌కు పూర్తిగా పెట్టుబడి సాయం నిలిపివేశారని వ్యాఖ్య
- మరో రెండు విడతల్లో పరిమిత ఎకరాలకే రైతు భరోసా చెల్లించారని ఆరోపణ
- రైతుబంధు పేరుతో రూ.29,300 కోట్లు రైతులకు బకాయి పడిందని వెల్లడి
- ఎన్నికల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శ
- రైతులను మభ్యపెట్టే ప్రయత్నాలను అన్నదాతలు గమనిస్తున్నారని వ్యాఖ్య



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.29,300 కోట్ల మేర బకాయి పడిందని మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే టి. హరీశ్‌రావు ఆరోపించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న రైతు ఆశీర్వాద సభ వాస్తవానికి రైతు వంచన సభగా మారిందని విమర్శించారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా సభల పేరుతో ప్రచారం చేసుకుంటోందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ప్రతి ఎకరానికి ఏడాదికి రూ.15 వేల పెట్టుబడి సాయం అందిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు కేవలం రూ.12 వేలే చెల్లించిందని హరీశ్‌రావు ఆరోపించారు. అందులోనూ ఒక పంట సీజన్‌కు సంబంధించిన రైతు భరోసాను పూర్తిగా మిగతా 2లో..

## ఎరువుల కొరతకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత

- తెలంగాణకు ఎరువుల సరఫరాను ఉద్దేశపూర్వకంగా తగ్గిస్తున్నారని ఆరోపణ
- ఎరువుల తయారీ, సరఫరా పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోనేనని స్పష్టీకరణ
- తెలంగాణలోని ఎరువుల కర్మాగారాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాలని డిమాండ్
- ఎరువుల కొరత కొనసాగితే బీజేపీ నేతల ఇళ్ల ముందు ధర్నాలు చేస్తామని హెచ్చరిక
- రాష్ట్ర బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచన
- హుస్నాబాద్‌లో సర్ ఓటరు సవరణ ప్రక్రియను పరిశీలించిన మంత్రి
- 17, 18 వార్డుల్లో కొనసాగుతున్న నమోదును పరిశీలించి అధికారులకు సూచనలు
- ఓటరు జాబితా సవరణ పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశం



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

జిల్లాలోని హుస్నాబాద్ పట్టణంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా పట్టణంలోని 17, 18 వార్డుల్లో కొనసాగుతున్న సర్ (ఎస్ఐఆర్) ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పరిశీలించారు. ఇంటింటికీ జరుగుతున్న వివరాల సేకరణ, నమోదుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని మిగతా 2లో..

## రైతన్నలకు శుభవార్త..!

- రైతు 'భరోసా' నిధులు విడుదల
- 41.37 లక్షల ఖాతాల్లో రూ.2,482 కోట్లు
- మరో 9 రోజుల్లో రూ.9 వేల కోట్ల పంపిణీ
- వ్యవసాయాన్ని పండుగలా చేస్తామన్న సీఎం
- రూ.20 వేల కోట్ల రైతు రుణమాఫీ పూర్తి
- 25.35 లక్షల మంది రైతులకు అప్పుల విముక్తి
- ఉచిత విద్యుత్ కాంగ్రెస్ పార్టీ కీర్తి
- నెలకు రూ.1,000 కోట్ల కరెంట్ సబ్సిడీతో అండ
- మార్కెట్ డిమాండ్‌కు తగ్గట్లుగా సాగు చేయాలి
- రైతులకు సీఎం రేవంత్ రెడ్డి కీలక సూచనలు

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ రాష్ట్రంలోని అన్నదాతలకు కాంగ్రెస్ ప్రభుత్వం భారీ ఊరటనిచ్చింది. రైతు సంక్షేమమే ధ్యేయంగా అడుగులు వేస్తున్న ప్రభుత్వం, ప్రతిష్టాత్మక 'రైతు భరోసా' నిధుల విడుదలకు శ్రీకారం చుట్టింది. హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో అత్యంత వైభవంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి రైతు భరోసా సభలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి బటన్ నొక్కి నిధులను నేరుగా రైతుల ఖాతాల్లోకి విడుదల చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి నిర్వహించిన ఈ విడత కార్యక్రమంలో భాగంగా తొలి విడతలోనే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 41.37 లక్షల మంది రైతుల మిగతా 2లో..



## ఢిల్లీ దర్బారుకు ఏటీఎంలా తెలంగాణ

- బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్
- ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ విఫలమైందని విమర్శ
- ఆర్ఆర్ ట్యాక్స్‌తో తెలంగాణ ప్రజలపై అదనపు భారం మోపుతున్నారని ఆరోపణ
- తెలంగాణ నుంచి ఢిల్లీకి నిధులు తరలుతున్నాయని తీవ్ర వ్యాఖ్యలు
- మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని వెల్లడి
- బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని స్పష్టం
- కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపు
- పశ్చిమ బెంగాల్‌లో కార్యకర్తల త్యాగమే పార్టీ విజయానికి కారణమని వ్యాఖ్య
- కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం కలిసి రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపణ
- బడుగు, బలహీన వర్గాలకు కాంగ్రెస్ పాలనలో న్యాయం జరగడం లేదని విమర్శ
- రాష్ట్రంలో బీజేపీ క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని శ్రేణులకు దిశానిర్దేశం



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణను ఢిల్లీ దర్బార్‌కు ఏటీఎంగా మార్చిందని భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజలపై ఆర్ఆర్ ట్యాక్స్ పేరుతో అదనపు భారం మోపుతూ ఇక్కడి నుంచి నిధులు ఢిల్లీకి తరలిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు మిగతా 2లో..

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ఏబీవీపీ ఆందోళన.. ఉద్రిక్తత

మొదటిపేజీ తరువాయి

ఉన్నత విద్యామండలి కార్యాలయం వద్ద అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఉన్నత విద్యామండలి కార్యాలయంలోకి చొచ్చుకెళ్లేందుకు ఏబీవీపీ శ్రేణులు ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు కార్యాలయం వద్ద భారీగా బలగాలను మోహరించి భద్రతను కట్టుదిట్టం చేశారు.

పోలీసుల అడ్డుకోవడాన్ని నిరసిస్తూ ఏబీవీపీ కార్యకర్తలు ముందుకు దూసుకెళ్లే ప్రయత్నం చేయడంతో తోపులాట జరిగింది. పరిస్థితి అదుపు తప్పకుండా ఉండేందుకు పోలీసులు ఆందోళనకారులను వెనక్కి నెట్టే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ నిరసనకారులు వెనక్కి తగ్గకపోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు పోలీసులు లాఠీలతో ఆందోళనకారులను చెదరగొట్టారు. అనంతరం పలువురు ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు. ఈ ఘటనతో ఉన్నత విద్యామండలి కార్యాలయం పరిసరాల్లో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేసి విద్యార్థుల ఇబ్బందులను ప్రభుత్వం పరిష్కరించాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

## రైతు భరోసాపై రేవంత్‌కు కేటీఆర్ సవాల్

మొదటిపేజీ తరువాయి

ఎదుర్కొంటున్న సమయంలో ఆశీర్వాద సభల పేరుతో రాజకీయ కార్యక్రమాలు నిర్వహించడం పీఆర్ స్టంట్ తప్ప మరొకటి కాదని వ్యాఖ్యానించారు.

రైతు భరోసా పథకాన్ని ఏకంగా నాలుగుసార్లు నిలిపివేశారని కేటీఆర్ ఆరోపించారు. ప్రతి ఎకరానికి ఏడాదికి రూ.15 వేల పెట్టుబడి సాయం అందిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోలేకపోయిందన్నారు. ప్రస్తుతం కొద్దిమంది రైతులకు మాత్రమే పరిమితంగా నిధులు విడుదల చేసి చేతులు దులుపుకుంటోందని విమర్శించారు.

రుణమాఫీ అంశంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని కేటీఆర్ ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని చెప్పి, ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. దాదాపు రూ.50 వేల కోట్లతో చేపట్టాల్సిన రుణమాఫీని పూర్తిగా అమలు చేయకుండా రైతులను నిరాశపరిచారని విమర్శించారు.

రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించకుండా ప్రజల దృష్టి మళ్లించేందుకే ప్రభుత్వం భారీ సభలు నిర్వహిస్తోందని ఆరోపించారు. పంట కొనుగోళ్ల విషయంలో కూడా కేంద్రం ఎంత కొనుగోలు చేస్తే అంతే కొనుగోలు చేస్తామని చెప్పి రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పించుకుంటోందని విమర్శించారు.

తమ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ నాయకత్వంలో రైతుబంధు పథకం ద్వారా 11 విడతల్లో రూ.73 వేల కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశామని కేటీఆర్ గుర్తు చేశారు. ఆ పథకం తెలంగాణ వ్యవసాయ రంగానికి బలమైన అండగా నిలిచిందని పేర్కొన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు.

రైతు వ్యతిరేక విధానాలతో ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తోందని కేటీఆర్ విమర్శించారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఈ తీరును అన్నదాతలు ఎన్నటికీ క్షమించరని హెచ్చరించారు. తెలంగాణ చరిత్రలో కేసీఆర్ రైతు బాంధవుడిగా నిలిచిపోతారని, కాంగ్రెస్



ప్రభుత్వం మాత్రం రైతు ద్రోహిగా గుర్తుండిపోతుందని తన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

## రైతులకు కాంగ్రెస్ రూ.29,300 కోట్లు బాకీ

మొదటిపేజీ తరువాయి

ఎగ్గొట్టిందని విమర్శించారు.

మరో విడతలో రెండు ఎకరాల వరకు మాత్రమే రైతులకు పెట్టుబడి సాయం అందించిందని, అనంతరం మూడు ఎకరాల వరకు పరిమితం చేసి చెల్లింపులు జరిపిందని పేర్కొన్నారు. దీంతో పెద్ద సంఖ్యలో రైతులు ప్రభుత్వ హామీలకు దూరమయ్యారని, రైతాంగంలో తీవ్ర అసంతృప్తి నెలకొందని అన్నారు.



రైతుబంధు పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ రూ.29,300 కోట్ల మేర రైతులకు బకాయి పడిందని హరీశ్‌రావు ఆరోపించారు. రైతులకు రావాల్సిన నిధులను వెంటనే విడుదల చేసి ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రైతుల సంక్షేమంపై చిత్తశుద్ధితో వ్యవహరించాలని, లేకుంటే రైతులు తగిన సమయంలో తగిన తీర్పు ఇస్తారని హెచ్చరించారు.

## ఢిల్లీ దర్బారుకు ఏటీఎంలా తెలంగాణ

మొదటిపేజీ తరువాయి

చేయలేదని మండిపడ్డారు. రాష్ట్రంలో అవినీతి, నేరాలకు ప్రోత్సాహం లభిస్తోందని, బడుగు, బలహీన వర్గాలకు తగిన న్యాయం జరగడం లేదని ఆరోపించారు.

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అధ్యక్షతన మల్కాజిగిరిలోని ఔషాపూర్ రాక్ ఎంక్లేవ్‌లో నిర్వహించిన పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నితిన్ నబీన్ ప్రసంగించారు. తెలంగాణలో పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బూత్ స్థాయి వరకు పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయాలని సూచించారు.

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం గత 12 ఏళ్లలో గణనీయమైన అభివృద్ధిని సాధించిందని నితిన్ నబీన్ అన్నారు. మౌలిక సదుపాయాల విస్తరణ, సంక్షేమ పథకాల అమలు, పేదల అభ్యున్నతి, ఆర్థికాభివృద్ధి వంటి రంగాల్లో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుందని పేర్కొన్నారు. భాజపా అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఎన్నికల హామీలను అమలు చేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటున్నామని చెప్పారు. తెలంగాణలో కూడా ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, మోదీ నాయకత్వంపై విశ్వాసం వ్యక్తం చేస్తున్నారని వ్యాఖ్యానించారు.

పార్టీ విజయానికి కార్యకర్తలే ప్రధాన బలమని నితిన్ నబీన్ అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో భాజపా ఎలా బలపడిందని చాలామంది ప్రశ్నిస్తుంటారని, అక్కడ కార్యకర్తలు ఎన్నో ఇబ్బందులు, దాడులు, ఒత్తిళ్లు ఎదుర్కొన్నప్పటికీ వెనక్కి తగ్గకుండా ప్రజల్లో పనిచేశారని తెలిపారు. వారి అంకితభావం, కష్టపడే తత్వం వల్లే పార్టీ విజయాన్ని సాధించిందన్నారు. తెలంగాణలో కూడా అదే స్ఫూర్తితో పనిచేస్తే పార్టీకి ప్రజల్లో మరింత ఆదరణ లభిస్తుందని పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని కార్యకర్తలకు సూచించారు. కేంద్ర పథకాల ద్వారా లబ్ధి పొందిన వర్గాలను మరింత చేరువ చేసుకోవాలని, ప్రతి గ్రామం, ప్రతి పట్టణంలో పార్టీ కార్యక్రమాలను విస్తరించాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా భాజపాను బలోపేతం చేయాలని సూచించారు.

రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు కొనసాగిస్తూ తెలంగాణలో ఆర్ఆర్ ట్యాక్స్ పేరిట వసూళ్లు జరుగుతున్నాయని నితిన్ నబీన్ ఆరోపించారు. రాష్ట్ర ప్రజల నుంచి సమకూరుతున్న నిధులు దిల్లీకి వెళ్తున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రయోజనాలను విస్మరించిందని విమర్శించారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని, ప్రజలు ఆశించిన పరిపాలన అందడం లేదని పేర్కొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి, నేరాలకు ప్రోత్సాహం ఇచ్చే విధంగా వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పరస్పర అవగాహనతో రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారం కంటే రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని, బడుగు, బలహీన వర్గాల సంక్షేమాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని అన్నారు.

రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పార్టీ సంస్థాగత బలోపేతం, సభ్యత్వ నమోదు కార్యక్రమం, బూత్ కమిటీల పటిష్ఠీకరణ, కేంద్ర ప్రభుత్వ విజయాల ప్రచారం, ప్రజా సమస్యలపై ఉద్యమాల నిర్వహణ, రానున్న ఎన్నికలకు సంబంధించి కార్యాచరణ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రతి జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేయాలని, ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగించాలని నాయకత్వం సూచించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

ఈ సమావేశంలో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర పదాధికారులు, జిల్లా అధ్యక్షులు, మోర్చాల నాయకులు, ప్రజాప్రతినిధులు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. తెలంగాణలో పార్టీ విస్తరణకు మరింత వేగం పెంచడం, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, రానున్న ఎన్నికలకు సమాయత్తం కావడం వంటి అంశాలపై సమావేశంలో దిశానిర్దేశం చేసినట్లు పార్టీ నాయకులు వెల్లడించారు.

## రైతన్నలకు శుభవార్త..!

మొదటిపేజీ తరువాయి

బ్యాంక్ ఖాతాల్లో రూ.2,482.02 కోట్లను నేరుగా జమ చేస్తున్నట్లు సీఎం అధికారికంగా ప్రకటించారు. ఈ చారిత్రక ఘట్టాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలోని అన్ని జిల్లాల పరిధిలోని రైతు వేదికల నుంచి వేలాది మంది రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులు వర్చువల్ (వీడియో కాన్ఫరెన్స్) పద్ధతిలో ప్రత్యక్షంగా వీక్షించారు.

నిధుల విడుదల అనంతరం సభను ఉద్దేశించి మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని రైతు లోకానికి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. తాము అధికారంలోకి వచ్చిన కేవలం 30 నెలల స్వల్ప కాలంలోనే వ్యవసాయాన్ని నష్టాల నుంచి లాభాల బాట పట్టించి, దానిని ఒక పండుగలా మార్చేందుకు అహర్నిశలు కృషి చేశామని సీఎం గర్వంగా ప్రకటించారు. గతంలో కంటే భిన్నంగా రైతు భరోసా సాయం మొత్తాన్ని ఏకంగా రూ.12 వేలకు పెంచామని ఆయన గుర్తుచేశారు. ఈ పెంపుదల వల్ల రైతులకు పెట్టుబడి కష్టాలు తీరతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. నిరంతరం రైతుల క్షేమాన్ని కాంక్షించే తమ ప్రభుత్వం, రైతు భరోసా పథకం ద్వారా ఇప్పటివరకు రూ.27 వేల కోట్లను రైతుల ఖాతాల్లో వేసిందని, తాజా విడతతో కలుపుకుంటే ఈ మొత్తం రూ.36 వేల కోట్లకు చేరిందని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు.

తెలంగాణ రైతులకు ఇచ్చిన ఎన్నికల హామీలను నెరవేర్చడంలో తమ ప్రభుత్వం ఎక్కడా వెనకడుగు వేయలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. రైతులను అప్పుల ఊబి నుంచి గట్టెక్కించేందుకు తాము చేపట్టిన ప్రతిష్ఠాత్మక రైతు రుణమాఫీ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు రికార్డు స్థాయిలో 25.35 లక్షల మంది రైతులకు సంబంధించి రూ.20 వేల కోట్ల విలువైన వ్యవసాయ రుణాలను పూర్తిగా మాఫీ చేశామని సీఎం సగర్వంగా ప్రకటించారు. బ్యాంకుల చుట్టూ తిరిగే అవసరం లేకుండా ఏకకాలంలో ఇంత పెద్ద మొత్తంలో రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని, దీనివల్ల లక్షలాది రైతు కుటుంబాల్లో కొత్త వెలుగులు నిండాయని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ అందించే చారిత్రాత్మక విధానాన్ని దేశంలోనే మొదటిసారిగా తీసుకొచ్చిన కీర్తి, గౌరవం ముమ్మాటికీ కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. రైతులు నాణ్యమైన పంటలు పండించాలనే ఉద్దేశంతో ప్రతి నెల ఏకంగా రూ.1,000 కోట్ల భారీ మొత్తాన్ని కేవలం విద్యుత్ సబ్సిడీ కోసమే ప్రభుత్వం భరిస్తోందని ఆయన వెల్లడించారు. ఉచిత కరెంట్‌తో పాటుగా సన్న వడ్ల సాగు చేసే రైతులకు ప్రత్యేక బోనస్ అందిస్తున్నామని, అలాగే దురదృష్టవశాత్తు చనిపోయిన రైతు కుటుంబాలను ఆదుకునేందుకు రైతు బీమా వంటి ఎన్నో అద్భుతమైన పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. వీటన్నింటికీ కలిపి కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రైతుల సంక్షేమం కోసమే రూ.1.75 లక్షల కోట్లకు పైగా నిధులను ఖర్చు చేసిందని సీఎం లెక్కలతో సహా వివరించారు.

ప్రస్తుతం మారుతున్న అంతర్జాతీయ వాతావరణ పరిస్థితులు, మార్కెట్ ఒడిదొడుకులను తట్టుకునేందుకు రైతులు కూడా తమ సాగు పద్ధతుల్లో మార్పులు చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. కేవలం పాత పద్ధతుల్లోనే కాకుండా, మార్కెట్‌లో ఏ పంటకు ఎక్కువ డిమాండ్ ఉందో గమనించి, దానికి అనుగుణంగానే పంటలను సాగు చేయాలని రైతులకు పిలుపునిచ్చారు. ముఖ్యంగా నాణ్యమైన పంటల ఉత్పత్తికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రైతుల సౌకర్యార్థం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని రైతు వేదికల్లో ప్రభుత్వం తరపున అత్యంత డిమాండ్ ఉన్న ఏడు రకాల సన్న వడ్ల విత్తనాలను సిద్ధంగా ఉంచామని, రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని లాభసాటి వ్యవసాయం వైపు అడుగులు వేయాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు.

అర్హులైన ప్రతి ఒక్క రైతుకూ ప్రభుత్వ సాయం అందుతుందని, ఎవరూ కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సీఎం భరోసా ఇచ్చారు. నిధుల పంపిణీ ప్రక్రియ నిరంతరాయంగా సాగుతుందని చెప్తూ, తాజాగా విడుదల చేసిన నిధులు కాకుండా, సరిగ్గా మరో 9 రోజుల్లో రైతు భరోసా పథకం కింద అదనంగా ఇంకో రూ.9 వేల కోట్ల భారీ నిధులను నేరుగా లబ్ధిదారులైన రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి వేదికపై నుంచి హామీ ఇచ్చారు. దీనివల్ల మిగిలిన రైతులకు కూడా సకాలంలో పెట్టుబడి సాయం అంది, ప్రస్తుత సాగు సీజన్‌కు ఎంతో ప్రయోజనకరంగా మారుతుందని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన అనాలోచిత ఆర్థిక విధానాల వల్ల రాష్ట్రాన్ని భారీ అప్పుల పాలైందని, వ్యవస్థలన్నీ దెబ్బతిన్నాయని సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. అంతటి కఠినమైన ఆర్థిక ఇబ్బందుల్లోనూ తాము అధికారంలోకి రాగానే పాలనను చక్కదిద్దామని చెప్పారు. గతంలో జీతాల కోసం ప్రభుత్వ ఉద్యోగులు ఎదురుచూసే పరిస్థితి ఉంటే, ఇప్పుడు ప్రతి నెల ఒకటో తేదీననే అందరికీ జీతాలు చెల్లిస్తున్నామని గుర్తుచేశారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీ, సింగరేణి సంస్థలను సమర్థవంతమైన నిర్ణయాలతో లాభాల బాట పట్టించామన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన 'ధరణి' పోర్టల్ స్థానంలో, ఎంతో పారదర్శకమైన 'భూభారతి' అనే సరికొత్త భూ రికార్డుల వ్యవస్థను తీసుకువచ్చి రైతులకు శాశ్వత భూ సమస్యల నుండి విముక్తి కల్పించామని సీఎం స్పష్టం చేశారు.

హైదరాబాద్ శిల్పకళా వేదికలో జరిగిన ఈ ప్రతిష్ఠాత్మక రైతు భరోసా సభకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి (డిప్యూటీ సీఎం) మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వీరితో పాటుగా ప్రభుత్వ ప్రముఖ మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావులతో పాటు ప్రముఖ నాయకులు అజారుద్దీన్, వాకిటి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మరియు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, వ్యవసాయ శాఖకు చెందిన ఉన్నతాధికారులు ఈ సభలో ఆశీనులయ్యారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు ఆయా ప్రాంతాల రైతు వేదికల నుండి రైతుల సమక్షంలో వర్చువల్ విధానంలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





## ఎరువుల కొరతకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత

మొదటిపేజీ తరువాయి

అధికారులకు సూచించారు.

అనంతరం మీడియాతో మాట్లాడిన మంత్రి పొన్నం ప్రభాకర్ రాష్ట్రంలో నెలకొన్న ఎరువుల కొరతకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఎరువుల తయారీ, సరఫరా పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశమని, దేశంలోని ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా స్వయంగా ఎరువులను తయారు చేయదని స్పష్టం చేశారు. కేంద్రం కేటాయించిన మేరకే రాష్ట్రాలకు ఎరువులు సరఫరా అవుతాయని తెలిపారు.

తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో లేకపోవడంతో ఉద్దేశపూర్వకంగానే రాష్ట్రానికి ఎరువుల సరఫరాను తగ్గించి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మంత్రి ఆరోపించారు. రైతులకు అవసరమైన సమయంలో తగినంత ఎరువులు అందించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేయకుండా కేంద్రం తన బాధ్యతను నిర్వర్తించాలని డిమాండ్ చేశారు.

తెలంగాణలో ఉన్న ఎరువుల ఫర్టిలైజర్ కర్మాగారాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాలని కేంద్రాన్ని మంత్రి కోరారు. రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా ఎరువుల ఉత్పత్తి, పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఈ అంశంపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రంలో ఎరువుల కొరత మరింత తీవ్రమైతే భారతీయ జనతా పార్టీ నాయకుల ఇళ్ల ముందు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. రాష్ట్ర బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు రైతుల సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి వెంటనే ఎరువుల సరఫరా పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు.

## సింధూ జలాలపై మళ్లీ పాక్ బెదిరింపులు


- **నీటి వాటా అడ్డుకుంటే తీవ్ర పరిణామాలంటూ పాక్ హెచ్చరిక**
- **సింధూ జలాల నియంత్రణకు భారత్ ప్రయత్నిస్తోందన్న ముసాదిక్ మాలిక్**
- **పాక్‌లోకి ఒక్క చుక్క నీరు కూడా రాకుండా చేస్తున్నారంటూ ఆరోపణ**
- **మా నీటి హక్కులను కాపాడుకుంటామని స్పష్టం చేసిన ఇస్లామాబాద్**
- **సింధూ జలాల ఒప్పందం చట్టబద్ధంగానే అమల్లో ఉందన్న తరార్**
- **భారత్ ఏకపక్షంగా ఒప్పందాన్ని రద్దు చేయలేదని పాక్ వాదన**
- **పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఒప్పందాన్ని నిలిపివేసిన భారత్**
- **2028 నాటికి పాక్‌కు నీటి ప్రవాహాన్ని నిలిపివేస్తామని సీఆర్ పాటిల్ వ్యాఖ్యలు**
- **భారత్ చర్యలపై వరుసగా స్పందిస్తున్న పాక్ మంత్రులు**
- **అవసరమైతే సైనిక చర్యలకూ వెనుకాడబోమన్న ఖవాజా ఆసిఫ్**



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేసిన నేపథ్యంలో పాకిస్థాన్ మరోసారి భారత్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేసింది. సింధూ జలాల్లో తమకు కేటాయించిన వాటాను అడ్డుకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని పాక్ పెట్రోలియం మంత్రి ముసాదిక్ మాలిక్ హెచ్చరించారు.

భారత్ సింధూ జలాలపై నియంత్రణ సాధించేందుకు ప్రయత్నిస్తోందని, పాకిస్థాన్‌లోకి ఒక్క చుక్క నీరు కూడా ప్రవహించకుండా అడ్డుకుంటోందని ఆయన ఆరోపించారు. తమ దేశ నీటి హక్కులకు భంగం కలిగితే దాని ఫలితాలు తీవ్రంగా ఉంటాయని, ఒప్పందం ప్రకారం తమకు దక్కాల్సిన నీటి వాటాను పరిరక్షించుకోవడానికి పాకిస్థాన్ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. మరో మంత్రి అట్టావుల్లా తరార్ మాట్లాడుతూ, నీటి అంశం పాకిస్థాన్ జాతీయ భద్రతకు సంబంధించిన అత్యంత కీలక అంశమని పేర్కొన్నారు. సింధూ జలాల ఒప్పందం ఇప్పటికీ చట్టబద్ధంగానే అమల్లో ఉందని, దానిని ఏకపక్షంగా రద్దు చేసే అధికారం భారత్‌కు లేదని ఆరోపించారు. 1960లో ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వంతో భారత్-పాకిస్థాన్ మధ్య సింధు నది, దాని ఉపనదుల జలాల పంపకానికి సింధూ జలాల ఒప్పందం కుదిరింది. అయితే పహల్గాం ఉగ్రదాడి అనంతరం ఈ ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్లు భారత్ ప్రకటించింది. ఇటీవల కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ మాట్లాడుతూ, 2028 జూన్ నాటికి పాకిస్థాన్‌కు వెళ్లే సింధు నదీ జలాల ప్రవాహాన్ని పూర్తిగా నిలిపివేసేలా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఈ నేపథ్యంలో పాక్ మంత్రులు వరుసగా భారత్‌పై విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికే పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ కూడా, భారత్ నీటి సరఫరాను అడ్డుకునే చర్యలను వేగవంతం చేస్తే అవసరమైతే సైనిక చర్యలకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు.

# తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయాలి

**ఆదిలాబాద్ జిల్లా బ్యూరో : డిడి 9 వార్త న్యూస్**

హైదరాబాద్ ఉప్పల్ భాగవత్ వద్ద ధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాటం చేసిన ఉద్యమకారులకు ప్రభుత్వం తగిన గుర్తింపు గౌరవం కల్పించాలని టిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని అభినందన గార్డెన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం జీవితాలను పణంగా పెట్టి ఉద్యమించిన వేలాది మంది కార్యకర్తలు ఇప్పటికీ ఆర్థిక, సామాజిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటానికి తమ వంతు పాత్ర పోషించిన ప్రతి ఉద్యమకారునికి లేదా వారు మరణించిన పక్షంలో వారి కుటుంబ సభ్యులకు నెలకు 20 వేల గౌరవ పెన్షన్ అందించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ప్రతి అర్హ ఉద్యమకారునికి 250 గజాల ఇంటి స్థలాన్ని మరియు ప్రతి ఉద్యమకరుని కుటుంబం లో ఒక ఉద్యోగం కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉద్యమ సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడాలంటే ఉద్యమకారులకు న్యాయం జరగాల్సిందేనని స్పష్టం చేశారు ఈ డిమాండ్ల సాధన కోసం జూలై 2న ఉప్పల్‌లో భారీ ధర్నా కార్యక్రమాన్ని టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు అధినేత్రి కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు రాథోడ్ బాపురావు వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి తెలంగాణఉద్యమకారులు.వారి కుటుంబ సభ్యులు ప్రజాసంఘాల ప్రతినిధులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఉద్యమకారుల హక్కుల సాధన కోసం ఐక్యంగా ముందుకు రావాలని, ప్రజాస్వామ్య పద్ధతిలో తమ డిమాండ్లను ప్రభుత్వానికి తెలియజేయాలని సూచించారు. తెలంగాణ సాధనలో ఉద్యమకారులు చేసిన త్యాగాలను ఎప్పటికీ మరువలేమని, వారి సేవలకు తగిన గౌరవం దక్కే వరకు పోరాటం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం ఉద్యమకారుల సమస్యలను సానుకూలంగా పరిశీలించి, సంక్షేమ చర్యలను ప్రకటించాలని కోరారు. ఈ సమావేశంలో ముఖ్య నాయకులు రాష్ట్ర అబ్జర్వర్ తాండ్ర శ్రీనివాస్‌తో పాటు ఉద్యమకారులు, వివిధ మండలాల ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో తెలంగాణ ఉద్యమకారులు పాల్గొన్నారు. సమావేశంలో జూలై 2 ధర్నా ఏర్పాట్లు, ఉద్యమకారుల డిమాండ్లపై విస్తృతంగా చర్చించి కార్యాచరణను రూపొందించారు.

## నిజామాబాద్ జిల్లాలో విజయవంతంగా
# పల్స్ పోలియో కార్యక్రమం

**నిజామాబాద్ జిల్లా జూన్30(డీడీ9 వార్త):**



జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఐదు సంవత్సరాల లోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమం చివరి రోజున, ఇప్పటివరకు చుక్కలు వేయించుకోని చిన్నారులను గుర్తించేందుకు ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, నర్సింగ్ విద్యార్థులు, ఎన్సీసీ వాలంటీర్లు ప్రతి ఇంటినీ సందర్శించారు. మొదటి రోజు 1,91,883 మంది అర్హులైన చిన్నారులకు గాను 1,80,596 మందికి, అంటే 94 శాతం మందికి పోలియో చుక్కలను అందించారు. రెండో రోజు మిగిలిన చిన్నారుల్లో 99 శాతం మందిని కవర్ చేస్తూ 9,264 మందికి చుక్కలు వేశారు. మూడు రోజుల మొత్తం గణాంకాలను పరిశీలిస్తే, లక్షిత చిన్నారుల కంటే అదనంగా 1,92,470 మందికి, అంటే 100.31 శాతం మందికి పోలియో చుక్కలు వేసి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ లక్ష్యాన్ని అధిగమించింది. మూడవ రోజున శతశాతం పురోగతిని సాధించి, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కృషి చేసిన వైద్య సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆశా కార్యకర్తలు, నర్సింగ్ మరియు ఎన్సీసీ విద్యార్థులను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాజశ్రీ ప్రత్యేకంగా అభినందించారు. అందరి సమష్టి కృషితోనే చిన్నారులకు పోలియో రహిత భవిష్యత్తును అందించడం సాధ్యమైందని ఆమె పేర్కొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆఫ్ కమ్మర్‌పల్లి నూతన కార్యవర్గం ఎన్నిక

**నిజామాబాద్ జిల్లా జూన్30(డీడీ9 వార్త):**

లయన్స్ క్లబ్ ఆఫ్ కమ్మర్‌పల్లి నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. స్థానిక లయన్స్ క్లబ్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో క్లబ్ సభ్యులందరూ కలిసి నూతన పదాధికారులను ఎన్నుకున్నట్లు తాజా మాజీ అధ్యక్షుడు లుక్కా గంగాధర్ వెల్లడించారు. ఈ ఎన్నికల ప్రక్రియలో భాగంగా క్లబ్ అధ్యక్షుడిగా తెడ్డు రమేష్, ప్రధాన కార్యదర్శిగా ఎండి హైమద్, కోశాధికారిగా సుంకరి విజయ్ కుమార్ ఎన్నికైనట్లు ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ... క్లబ్ ద్వారా ఇప్పటివరకు చేపట్టిన సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని, సమాజ హితమే లక్ష్యంగా అందరి సహకారంతో విశేషంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. నూతన కార్యవర్గానికి క్లబ్ సభ్యులు ఘనంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ప్రధాన కార్యదర్శి రేవతి గంగాధర్, సభ్యులు చింత ప్రదీప్, సూరంగి చంద్రశేఖర్, పడిగేలా ప్రవీణ్, లింగారెడ్డి, రవీందర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.





## మహిళలు ఆర్థిక, సామాజిక, రాజకీయంగా ఎదగాలి

- **టీ ఆర్ పి ములుగు జిల్లా నాయకులు**

**డీ డీ 9 వార్త, ములుగు :**

మహిళలు సామాజిక ఆర్థిక రాజకీయ రంగాల్లో ఎదగాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు దిలీప్ కుమార్ అన్నారు. మండలంలోని నల్లగొండ గ్రామంలో ఉన్న మత్స్య సహకార సంఘం మహిళ విభాగం అధ్యక్షురాలు ఏల సావిత్రి, కార్యదర్శి గుండ్ల రమలను ఆయన కలిసి భువనగిరి మహాసభకు ఆహ్వానించారు. ఆయన వెంట తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు ఉన్నారు.






## బోధన్ మున్సిపల్‌లో కోఆప్షన్ ఎన్నికల సందడి

**బోధన్, నిజామాబాద్ జూన్30(డీడీ9 వార్త):**

బోధన్ మున్సిపల్ కోఆప్షన్ సభ్యుల ఎన్నిక ప్రక్రియ మంగళవారం అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య, ప్రశాంతంగా ముగిసింది. మున్సిపల్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పర్యవేక్షణలో జరిగిన ఈ ప్రత్యేక సమావేశం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఎక్స్అఫిషియో సభ్యుని హోదాలో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్‌రెడ్డి ఈ ఎన్నికలో పాల్గొని ఓటు హక్కును వినియోగించుకున్నారు. సభకు హాజరు కావాల్సిన 39 మంది సభ్యులు పూర్తిస్థాయిలో హాజరు కావడంతో కోరం నిర్ధారణ అయింది. ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న తరుణంలో, 12 మంది ఎంఐఎం కౌన్సిలర్లు ఆకస్మికంగా ఎన్నికను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించి సభ నుంచి నిష్క్రమించారు. దీనిని ఏమాత్రం పట్టించుకోని అధికార యంత్రాంగం, నిబంధనల ప్రకారం మిగిలిన సభ్యులతో ఎన్నికను కొనసాగించింది. నాలుగు కోఆప్షన్ పదవులకు గాను 35 దరఖాస్తులు అందగా ఎటువంటి గందరగోళానికి తావు లేకుండా, ప్రతి అభ్యర్థి పేరును చదువుతూ, చేతులెత్తే పద్ధతి ద్వారా సభ్యులను ఎన్నుకున్నారు. ఈ మొత్తం ప్రక్రియను వీడియో చిత్రీకరణ చేయడంతో పాటు, పారదర్శకంగా నిర్వహించారు. మెజారిటీ సభ్యుల 19 మంది మద్దతుతో దండు సంగ్రామ్, మాసుల లక్ష్మి, మహమ్మద్ ఇమ్రాన్, రఫీయా బేగంలు కోఆప్షన్ సభ్యులుగా ఎన్నికైనట్లు ప్రిసైడింగ్ అధికారి జాదవ్ కృష్ణ ప్రకటించారు. ఎన్నికైన వారికి కలెక్టర్ ఇలా త్రిపాఠి, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి నియామక పత్రాలను అందజేసి అభినందనలు తెలిపారు. మున్సిపల్ కార్యాలయం వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ఆర్డీఓ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, తహసీల్దార్ విఠల్ తదితరులు పాల్గొన్నారు.




## పోలీసు శాఖలో ఘనంగా పదవీ విరమణ వీడ్కోలు

**నిజామాబాద్ జిల్లా జూన్30(డీడీ9 వార్త):**

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో మంగళవారం పదవీ విరమణ చేసిన పోలీస్ సిబ్బందికి ఘనమైన వీడ్కోలు లభించింది. సుదీర్ఘకాలం పాటు పోలీస్ శాఖలో వివిధ హోదాల్లో సేవలందించి, జూన్ నెలతో ఉద్యోగ బాధ్యతల నుండి తప్పుకున్న ఏఎస్ఐలు అంగూర్ సుదర్శన్ (టౌన్4), మహమ్మద్ అబ్దుల్ వహాబ్ (ఆర్మూర్), ఏఆర్ ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ హకీం, హెడ్ కానిస్టేబుల్ ఎం.ఏ. అజ్మత్ (కోటగిరి), మరియు సీనియర్ అసిస్టెంట్ తాకుర్ ఆషా కుమారిల గౌరవార్థం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 36 నుంచి 41 ఏళ్ల పాటు సుదీర్ఘ సర్వీసును పూర్తి చేసుకున్న ఈ ఉద్యోగులను కమిషనరేట్ అధికారులు శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య మాట్లాడుతూ... పోలీస్ శాఖలోని తీవ్ర పని ఒత్తిడిని తట్టుకుని, ఎలాంటి రిమార్కులు లేకుండా సుదీర్ఘకాలం విధులు నిర్వహించడం గర్వించదగ్గ విషయమని కొనియాడారు. ప్రభుత్వ ఉద్యోగంలో పదవీ విరమణ అనేది ఒక సహజ ప్రక్రియ అని పేర్కొంటూ, శాఖకు వారు అందించిన సేవలు ఎంతో విలువైనవని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం కూడా పోలీస్ శాఖ నుండి వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ వీడ్కోలు కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) ఎన్. శుభం ప్రకాష్, ఏవో ఆసియా బేగం, ఏఆర్ ఏసీపీ బి. శ్రీరాములు, ఆఫీస్ సూపరింటెండెంట్లు శంకర్, జగతి, ప్రత్యేక శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి, సీఐ శ్రీనివాస్, ఆర్ఐ ధరణి కుమార్, ఎస్ఐ శేఖర్ బాబు, సతీష్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు షాకిల్ పాషాతో పాటు పదవీ విరమణ చేసిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## ప్రతీ పౌరుడు తన హక్కులను తెలుసుకోవాలి

**ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ న్యూస్ (డిడి 9 వార్త న్యూస్ ), జూన్ 30**

ప్రతి భారతీయ పౌరుడు తన హక్కులను తెలుసుకోవడమే జిల్లా విజిలెన్స్ కమిటీ యొక్క ముఖ్య లక్ష్యమని జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు మెస్రం జంగు బాపు పేర్కొన్నారు. మండలంలోని గంగాపూర్ గ్రామంలో మంగళవారం 'పౌర హక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ సోదర భావంతో మెలగాలని, ప్రజల మధ్య ఎలాంటి వివక్ష ఉండకూడదని ఆకాంక్షించారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలు ఎక్కడా, ఎలాంటి వివక్షకు గురికాకుండా చూసేందుకు జిల్లా వ్యాప్తంగా విజిలెన్స్ కమిటీ నిరంతరం కృషి చేస్తోందని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు రెవెన్యూ ఇన్స్పెక్టర్ నూర్ ర్సింగ్, సర్పంచ్ టెకం సుభాష్, పంచాయతీ కార్యదర్శి కె నీత ఉపాధ్యాయుడు రాజు , ఉపసర్పంచ్ పాల్వ మారుతీ ,వికాస్ మరియు గ్రామ ప్రజలు.




## భూపోరాటకార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**ఆదిలాబాద్ జిల్లా బ్యూరో : (డిడి 9 వార్త న్యూస్ )**

తెలంగాణ ఉద్యమంలో త్యాగాలు చేసి ఎంతో మంది జైలు జీవితం గడిపిన అమరుల తెలంగాణను సాధించుకున్నాం . ఉద్యమకారులందరూ ఈరోజు రోడ్డున పడిన పరిస్థితి. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల భూమి 25 వేల పింఛన్. గుర్తింపు కార్డు ఇచ్చి ఆదుకుంటామని చెప్పిన ఈ ప్రభుత్వం జీవో విడుదల చేసి కేకే కమిటీ వేసి కాలయాపన చేస్తున్న పరిస్థితి .కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పుతున్న పరిస్థితుల్లో తెరాస అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వారు తెలంగాణ ఉద్యమకారులకు అండగా నిలబడి జూలై రెండవ తారీఖు నాడు హైదరాబాదులోని ఉప్పల్ బగాయిత్ భూ పోరాట కార్యక్రమాన్ని కవితక్క గారి ఆధ్వర్యంలో జరుగుతున్నందున ఆదిలాబాద్ జిల్లాలో ఉన్నటువంటి తెలంగాణ ఉద్యమకారులు అందరు కూడా ఉప్పల్ భాగాయత్ చేరుకొని భూ పోరాట కార్యక్రమాన్ని మిలియన్ మార్చ్ తలపించేలా విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారులను కోరడం జరుగుతుంది ఈ కార్యక్రమంలో తెరాస రాష్ట్ర పరిశీలకులు తాండ్ర శ్రీనివాస్ తెరాస సీనియర్ నాయకులు రంగినేని శ్రీనివాస్ అసపు ప్రమోద్ కుమార్ శ్రీపాద కార్తీక్ తదితరులు పాలుగోన్నారు








## భరత్‌చంద్ర పాఠశాల యాజమాన్యంపై
# చర్యలు తీసుకోవాలి

- **విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్**

**నిజామాబాద్ జిల్లా జూన్30(డీడీ9 వార్త):**

ఆర్మూర్ భరత్‌చంద్ర పాఠశాలలో విద్యార్థులకు అనుమతి లేకుండా నమాజ్, ఉర్దూ నేర్పిస్తున్నారంటూ విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ నాయకులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆర్మూర్ ఏసీపీ మరియు సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ అమీర్ వ్యవహరించిన తీరుపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. తల్లిదండ్రుల అనుమతి గానీ, విద్యాశాఖ అనుమతి గానీ లేకుండా హిందూ విద్యార్థులకు ఉర్దూ, కల్మా, నమాజ్ నేర్పించడం పట్ల వారు అభ్యంతరం తెలిపారు.
విద్యార్థులపై ఇటువంటి మతపరమైన అంశాలను రుద్దడం సరికాదని, ఇది విద్యా సంస్థల నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. బాధ్యులైన ప్రిన్సిపాల్, పాఠశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి గాజుల దయానంద్, జిల్లా విశేష సంపర్క ప్రముఖ్ అల్జపూర్ అక్షయ్, నగర కార్యదర్శి కొంగి రవి, ఉపాధ్యక్షులు ప్రేమ్, సహా కార్యదర్శి కరణ్, బజరంగ్‌దళ్ ప్రముఖ్ ప్రవీణ్, సాయి, అరవింద్‌తో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.



# అంగన్వాడి పాఠశాలలో చిన్నారుల అభివృద్ధులు...

**డీ డీ 9 వార్త, ములుగు :**

చిన్నారులలో అన్నిరకాల అభివృద్ధి జరగాలంటే అంగన్వాడి పాఠశాలలకు పంపాలని ములుగు ప్రాజెక్టు సి.డి.పి.ఓ శిరీష మంగళవారం కొడిశెలకుంట సెక్టార్ లోని శ్రీరాములపల్లి అంగన్వాడి పాఠశాలలో ప్రథమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జరిగిన స్కూల్ రెడీనెస్ మేళా కార్యక్రమంలో పాల్గొని తెలిపారు.

పిల్లలకు విద్యాబుద్ధులతో పాటు మంచి పౌష్టిక ఆహారం కూడా అంగన్వాడి సెంటర్ లో అందుతుందన్నారు. ప్రైవేటు పాఠశాలలో పిల్లలకు బట్టీ సిస్టమ్ ద్వారా చదువు నేర్పిస్తున్నారని, అంగన్వాడీలలో ఆటపాటల ద్వారా చదువు, కథలు నేర్పిస్తారని తెలిపారు.

గ్రామంలోని తల్లిదండ్రులందరు చిన్నారులను అంగన్వాడి బడికి పంపాలని, మన బడిని మనమే కాపాడుకోవాలని గ్రామ సర్పంచ్ రాజేందర్ తెలిపారు. అంగన్వాడి బడికి 3 నుండి 5 సంవత్సరాల పిల్లలను పంపిస్తే అన్నీ రకాలుగా అభివృద్ధి చెందుతారని తెలిపారు.

పిల్లలను అంగన్వాడి టీచర్ తల్లి లాగ చూసుకుంటుందని, అన్నిరకాల మంచి అలవాట్లు, ఆట పాటలు నేర్పిస్తుందని గ్రామ ఉపసర్పంచ్ తిరుపతి తెలిపారు. కార్యక్రమానికి వచ్చిన సెక్టార్ సూపర్ వైజర్ సరస్వతి మాట్లాడుతూ చిన్నారులకు ఆటలు పాటలు, కథలు, మంచి అలవాట్లు టీచర్ నేర్పిస్తుందన్నారు.

విద్యార్థులలో శారీరక, భాషా బుద్ధి వికాస మేధోభివృద్ధి, మరియు పూర్వగణిత వికాసానికి చెందిన అభివృద్ధి అంగన్వాడి పాఠశాలలకు వచ్చిన వారిలో ఎక్కువగా జరుగుతాయని, వారు తెలివిగల వారుగా తయారవుతారని ప్రథమ్ స్వచ్ఛంద సంస్థ మాస్టర్ ట్రైనర్ నాగేశ్వర్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజేందర్, ఉపసర్పంచ్ తిరుపతి, సి.డి.పి.ఓ శిరీష, సూపర్ వైజర్, మదర్స్, అంగన్వాడి టీచర్లు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.





## బషీరాబాద్ లో గురువుకు ఘనంగా వీడ్కోలు

**నిజామాబాద్ జిల్లా జూన్30(డీడీ9 వార్త):**

కమ్మర్‌పల్లి మండలంలోని బషీరాబాద్ ఉన్నత పాఠశాలలో తెలుగు పండితులుగా నాలుగు దశాబ్దాలకు పైగా నిష్కళంకమైన సేవలు అందించిన వంగరి మధుసూదన్ కు పాఠశాల పాలకవర్గం, గ్రామస్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. సుదీర్ఘకాలం విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి, ఎంతో మందిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన ఆయన పదవీ విరమణ సందర్భంగా పాఠశాల ఆవరణలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు ఆయన విద్యాబోధనలో చూపిన అంకితభావం, విద్యార్థుల పట్ల ఆయనకున్న ప్రేమను గుర్తుచేసుకుంటూ కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జమున మహేష్, ఉప సర్పంచ్ చిలివేరి భూమేశ్వర్, పంచాయతీ కార్యదర్శి నవీన్ గౌడ్, వార్డు సభ్యులు నెల్ల రమేష్, బందెలా రాజు, అంకడి శేఖర్, రాకేష్ గౌడ్, వీడీసీ అధ్యక్షుడు పృథ్వీ రాజ్, సెక్రెటరీ ఆనంద్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజలకు స్నేహపూర్వక పోలీసింగ్ అందించాలి

- **సీపీ సాయి చైతన్య**

**నిజామాబాద్ జిల్లా జూన్30(డీడీ9 వార్త):**

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సిరికొండ పోలీస్ స్టేషన్‌ను పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌కు చేరుకున్న ఆయనకు సిబ్బంది గౌరవ వందనం సమర్పించగా, అనంతరం ఆవరణలో మొక్కలు నాటారు. స్టేషన్‌లోని రికార్డులు, ఆయుధాలు, భద్రతా పరికరాలు, కిట్ ఆర్టికల్స్ నిర్వహణ తీరును క్షుణ్ణంగా పరిశీలించి, వాటిని భద్రపరిచే విషయంలో అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా రిసెప్షన్ సెంటర్‌ను సందర్శించి, ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదుల నమోదు విధానాన్ని, బాధితులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుని గౌరవంగా పలకరించి, వారి సమస్యలను ఓర్పుతో విని వెంటనే స్పందించాలని సిబ్బందిని ఆదేశించారు.

కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ సూచించారు. స్టేషన్‌లో అమలవుతున్న '5 ఎస్' విధానాన్ని సమీక్షిస్తూ, ప్రజల్లో పోలీస్ శాఖపై నమ్మకం పెరిగేలా పారదర్శకమైన సేవలు అందించాలని కోరారు. సైబర్ నేరాల పట్ల విద్యార్థులు, యువతను అప్రమత్తం చేసేలా పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. జిల్లా సరిహద్దులుగా ఉన్న జగిత్యాల, సిరిసిల్ల, కామారెడ్డి రహదారులపై నిఘాను పటిష్టం చేయాలని, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ఎన్ఫోర్స్‌మెంట్‌ను ముమ్మరం చేయాలని స్పష్టం చేశారు. ఆన్‌లైన్ బెట్టింగ్స్, గేమ్స్, డ్రగ్స్ వంటి దురలవాట్ల పట్ల ప్రజలను, ముఖ్యంగా యువతను చైతన్యవంతులను చేయాలని పిలుపునిచ్చారు. సిబ్బంది 24 గంటల పాటు హెడ్ క్వార్టర్స్‌లోనే అందుబాటులో ఉండాలని, క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని సూచించారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తూ ప్రతి ఆరు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలని, బైక్‌పై ప్రయాణించేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించి అందరికీ ఆదర్శంగా నిలవాలని కమిషనర్ కోరారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ఏసీపీ బి. ప్రకాష్ యాదవ్, ధర్పల్లి సీఐ బి. భిక్షపతి, సీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ బి. అంజయ్య, సిరికొండ ఎస్ఐ జె. రామకృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## మంగపేట మండలం కమలాపురం గ్రామంలో సర్వే కార్యక్రమంలో ఓటర్ లిస్ట్ అందజేత

**మంగపేట జూన్ 30 డీడీ 9 వార్త**

ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురం గ్రామంలో నిర్వహిస్తున్న సర్ (SIR) కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ పరిధిలోని ఓటర్ల జాబితాను గ్రామపంచాయతీ కరోబార్ కొమురెల్లి సంబంధిత సిబ్బందికి అధికారికంగా అందజేశారు. ఈ సందర్భంగా ఓటర్ లిస్ట్‌కు సంబంధించి గుర్తించిన నూకల రాజేష్‌కు కూడా జాబితాను అందించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సిబ్బంది, గ్రామపంచాయతీ అధికారులు పాల్గొని ఓటర్ల వివరాలను పరిశీలించడం, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామస్థులు కూడా తమ ఓటరు వివరాలను పరిశీలించి అవసరమైతే సవరణలు, చేర్పులు, తొలగింపులకు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు.




## బీసీల రాజ్యాధికారమే తీన్మార్ మల్లన్న లక్ష్యం

- **భువనగిరి సమరభేరికి బీసీలు తరలి వెళ్లాలి**
- **టిఆర్పి ములుగు జిల్లా అధ్యక్షుడు తవిటి దిలీప్ కుమార్**

**ములుగు, జూన్ 30, డీ డీ 9 వార్త :**

బీసీలు రాజ్యాధికారం సాధించడమే లక్ష్యంగా తీన్మార్ మల్లన్న కృషి చేస్తున్నారని తెలంగాణ రాజ్యాధికారం పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు తవిటి దిలీప్ కుమార్ అన్నారు. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలో ఆయన మంగళవారం పర్యటించి పలువురిని కలిశారు. ఈ సందర్భంగా దిలీప్ కుమార్ మాట్లాడుతూ భువనగిరి పట్టణంలో ఈనెల 5వ తేదీన నిర్వహించే టిఆర్పి సమరభేరి సమావేశానికి ప్రతి ఒక్కరు తరలి వెళ్లాలని ఆయన కోరారు. తెలంగాణ రాష్ట్రంలో అతి తక్కువ శాతం ఉన్న అగ్రకులాలదే రాజ్యాధికారం ఉంటుందని, బీసీ, దళిత, మైనారిటీలు రాజ్యాధికారం సాధించడం కోసం తీన్మార్ మల్లన్న పార్టీ స్థాపించి ప్రజలను చైతన్యం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట టీ అర్ పి రాష్ట్ర కార్యదర్శి గట్ల రాజన్న, జిల్లా ఉపాధ్యక్షులు కోరే రవి, జిల్లా మహిళా అధ్యక్షురాలు శీలవంతుల సునీత, జిల్లా ఉపాధ్యక్షులు మొగిలిపల్లి వినోద, యువజన విభాగం నాయకులు గట్ల వినీత, సోషల్ మీడియా ఇన్చార్జి, జిల్లా కార్యదర్శి వడ్లూరి మనమ్మ సభ్యులు యాప సౌజన్య, అనిల్ తదితరులు ఉన్నారు.



## రాజ్యాధికార సమరభేరికి ఆహ్వానం

**జనగామ, జూన్ 30 (డిడి 9 వార్త) బ్యూరో:**

భువనగిరిలో జూలై 5న నిర్వహించనున్న రాజ్యాధికార సమరభేరి సభకు హాజరై విజయవంతం చేయాలని టీఆర్‌పీ జనగామ జిల్లా అధ్యక్షుడు కట్ల సదానందం, జనగామ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు జగదీశ్ చందర్ రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో చెన్నూరి వంశీ, అలీ ముద్దీన్ బాబా, యామంకి విజయ్, గంగరాజు, పిట్టల సురేష్ తదితరులు పాల్గొన్నారు.



## రాజ్యాధికార సమరభేరి సభకు తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి, గంగపుత్ర రాజ్యాధికార పార్టీ నాయకులకు ఆహ్వానం

**జనగామ జూన్ 30(డిడి 9వార్త)బ్యూరో**

తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో జూలై 5న భువనగిరి జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రాజ్యాధికార సమరభేరి భారీ బహిరంగ సభకు సంబంధించి ఆహ్వాన పత్రికను తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక కి , అలాగే గంగపుత్ర రాజ్యాధికార పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మాదరబోయిన నర్సయ్య కి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల రాజ్యాధికార సాధన కోసం నిర్వహిస్తున్న ఈ సమరభేరిని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ జర్నలిస్ట్ సిద్ధగోని సుదర్శన్ గౌడ్, పార్టీ స్టేట్ ఆఫీస్ కోఆర్డినేటర్ లింగం యాదవ్ పాల్గొన్నారు



## సింగరేణి అధికారుల రిలే నిరాహార దీక్షలకు మద్దతు తెలిపిన టి డి పి,టి ఎన్ టి యు సి,నాయకులు.

**డిడి9వార్త / రామగుండం జులై 1:**

బొగ్గు గనుల అధికారుల అసోసియేషన్ డిమాండ్ల సాధన కోసం అర్జీ1జి ఏం, కార్యాలయం ముందు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండవ రోజు చేరుకున్నాయి, ఇట్టి డిమాండ్ల సాధనకి కృషి చేస్తున్న అధికారులకి మద్దతుగా తెలుగుదేశం అనుబంధ సంఘం ఐనా టి ఎన్ టి యు సి, వర్కింగ్ ప్రెసిడెంట్ కే నిమ్మకాయల ఏడుకొండలు తెలుగుదేశం పార్టీ నాయకులు అనుబంధ టి ఎన్ ఎస్ ఎఫ్, నాయకులు మద్దతు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారులని సైతం ఇబ్బందులకు గురి చేసి నిరాహార దీక్షలు చేసే పరిస్థితి తెచ్చిందని సింగరేణి పరిరక్షణలో భాగమైన అధికారులకి జీతం అప్గ్రేడ్,పి ఆర్ పి, పి ఆర్ సి. లు వెంటనే అమలు చేయాలనీ వారు డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో పెగడపల్లి రాజానర్సు, కామెర రాజబాబు, కోండి శ్రీనివాస్, బేక్కం వీరేందర్, గుండబోయిన ఓదెలు,మాటేటి లక్ష్మి,నా రెడ్డి స్వరాజ్యం, చిట్యాల అశ్విని, రామగిరి రాజేశ్వరి,సుందిల్ల స్వామి, ఇందారం రాజబాబు. తదితరులు పాల్గొన్నారు.




## తెలంగాణ రాష్ట్రంలో బీసీల రాజ్యం కావాలి

- **తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు దిలీప్ కుమార్**

**డీ డీ 9 వార్త, ములుగు :**

తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు రాజ్యాధికారం రావాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు తవిటి దిలీప్ కుమార్ అన్నారు. వెంకటాపూర్ మండల కేంద్రంలో మంగళవారం మాజీ ఎంపీటీసీ పోశాల వీరమల్లు ను టిఆర్పి నాయకులు కలిసి భువనగిరి మహాసభకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా దిలీప్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు అధికారం రావాలని అప్పుడే సామాజిక ఆర్థిక న్యాయం జరుగుతుందని తెలిపారు. అగ్రకుల ఆధిపత్య పాలనలో బీసీలు ఆర్థికంగా సామాజికంగా వెనుకబడి పోతున్నారని ఆయన ఆవేదన చెందారు. ఈ సందర్భంగా ఆయన వెంట టీ అర్ పి నాయకులు ఉన్నారు.



## హోంగార్డుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

- **ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**
- **హోంగార్డుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ**
- **ప్రతినిధులతో సమావేశమై సమస్యలను విన్న ఎమ్మెల్యే**
- **సంబంధిత అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని భరోసా**



**పెద్దపల్లి బ్యూరో, జూన్ 30 (డీడీ9 వార్త):**

రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్‌ను మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హోంగార్డుల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను వివరించారు.

ఈ సందర్భంగా హోంగార్డులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటిని శ్రద్ధగా విన్న రాజ్ ఠాకూర్ సంబంధిత అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రజా సేవలో హోంగార్డులు కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. హోంగార్డుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి న్యాయమైన సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని స్పష్టం చేశారు.



# అంగన్వాడీ చిన్నారులకు యూనిఫాంలు అందించిన మనాలి ఠాకూర్

- **పొట్యాల గ్రామ అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే సతీమణి**
- **చిన్నారుల విద్య, ఆరోగ్యం, సంక్షేమానికి అంగన్వాడీలే బలమైన పునాది**
- **నాణ్యమైన పోషకాహారం, మెరుగైన విద్య అందించాలని సిబ్బందికి సూచన**

**పెద్దపల్లి బ్యూరో, జూన్ 30 (డీడీ9 వార్త):**

రామగుండం శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు ఆయన సతీమణి మనాలి ఠాకూర్ మంగళవారం అంతర్గాం మండలం పొట్యాల గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు యూనిఫాంలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మనాలి ఠాకూర్ మాట్లాడుతూ.... చిన్నారుల విద్యాభివృద్ధి, ఆరోగ్యం, సంక్షేమానికి అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. ప్రతి చిన్నారి ఆనందంగా, ఆత్మవిశ్వాసంతో విద్యను అభ్యసించేలా అవసరమైన సౌకర్యాలు కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

అనంతరం అంగన్వాడీ సిబ్బందితో మాట్లాడిన మనాలి ఠాకూర్, చిన్నారులకు నాణ్యమైన పోషకాహారం, పరిశుభ్రమైన వాతావరణం, మెరుగైన ప్రాథమిక విద్య అందించేందుకు మరింత శ్రద్ధతో పనిచేయాలని సూచించారు.



ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, అంగన్వాడీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# కబ్జాకు గురై సాగుచేసుకుంటున్న స్మశాన వాటికను వెలుగులోకి తెచ్చిన గ్రామ సర్పంచ్ మగ్గిడి స్వరూపశ్రీనివాస్.

- **కబ్జాకు గురైన స్మశాన వాటికకు ఆధారాలు సేకరించి ప్రైవేట్ భూమి కాదు, ప్రభుత్వ భూమి అని హద్దులు పెట్టించిన-సర్పంచ్.**

**డిడి9వార్త / పెద్దపల్లి జులై 1:**

పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం మురుమూరు గ్రామంలో గత కొద్ది సంవత్సరాల క్రితం మురుమూరు గ్రామ స్మశాన వాటిక కబ్జా గురై కబ్జాదారులు సాగు చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మగిడి స్వరూప శ్రీనివాస్ మాట్లాడుతూ రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ ఆదేశానుసారం గత కొద్ది సంవత్సరాలుగా స్మశాన వాటిక భూమి కబ్జాకు గురై సాగు చేసుకోవడం జరుగుతుంది. దీనిని మేము గ్రహించి మేముప్రత్యేక చొరవ తీసుకొని కబ్జాకు గురై సాగు చేసుకున్నటువంటి స్మశాన వాటిక భూమిని గుర్తించి కబ్జాకు గురైనటువంటి స్మశాన వాటిక భూమికి సంబంధిత ఆధారాలను సేకరించి ఇది సాగు భూమి కాదు, ప్రభుత్వ భూమి అని గుర్తించి, అంతర్గాం తహసిల్దార్ ను పిలిపించి కబ్జాకుగురైన నైనటువంటి స్మశాన వాటిక భూమి సరిహద్దులను చూపించి మా గ్రామ ప్రజలకు స్మశాన వాటికకు ఇబ్బంది లేకుండా, స్మశాన వాటికను గ్రామ ప్రజల కోసం ఉపయోగపడాలనె ఆలోచనతో సర్పంచ్ మగ్గిడి స్వరూప శ్రీనివాస్ ప్రత్యేక చొరవ తీసుకొని భూమి సరిహద్దులను చూపించడం జరిగింది. అనంతరం అంతర్గంత తాసిల్దార్ సరిహద్దులను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని గ్రామ సర్పంచ్ మగ్గిడి స్వరూప శ్రీనివాస్ తెలిపారు .ఈ కార్యక్రమంలో రెవెన్యూ తహసిల్దార్ పడాల వరప్రసాద్, గ్రామ సర్పంచ్ మగ్గిడి స్వరూప శ్రీనివాస్, పాలకవర్గం లంక మదనయ్య, గ్రామ ప్రజలు కొంతం సత్తయ్య, మగ్గిడి రమేష్,జూల విజయ్,కమ్మరి శ్రీనివాస్, గెల్లు ఓదెల్,కారోబార్ పితంబర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.



- **బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచన..**

**మణుగూరు.జూన్ 30(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు మండలం శివలింగాపురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మంగళవారం నాడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను కలిసి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకోవడంతో పాటు, వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు.అనంతరం ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వసతులు, అవసరమైన వైద్య పరికరాలు, మందుల నిల్వ, సిబ్బంది (స్టాఫ్) కొరత తదితర అంశాలపై వైద్యాధికారులు, సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలు అందేలా నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, మైనారిటీ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# అనాథ చిన్నారులకు ఉచిత మెగా వైద్య శిబిరం

- **బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి: ఎంఈఓ జింక మల్లేష్**
- **నేటి పిల్లలే రేపటి మేధావులు: సీడీపీఓ అలేఖ్య పటేల్**
- **మాదిరెడ్డి భాస్కర్‌రావు వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమం**
- **వందలాది మందికి ఉచిత వైద్య పరీక్షలు, మందుల పంపిణీ**

**పెద్దపల్లి బ్యూరో, జూన్ 30 (డీడీ9 వార్త):**

ఆరోగ్యమే మహాభాగ్యమని, విద్యార్థులు ఆరోగ్యంగా ఉండి తాము అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని రామగుండం మండల విద్యాధికారి జింక మల్లేష్ అన్నారు. నేటి పిల్లలే రేపటి మేధావులని, వారి ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని సీడీపీఓ అలేఖ్య పటేల్ పేర్కొన్నారు. మాదిరెడ్డి భాస్కర్‌రావు వర్ధంతి సందర్భంగా కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి సహకారంతో మాదిరెడ్డి ఇందుమతి భాస్కర్‌రావు చారిటబుల్ ట్రస్ట్ మరియు ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో రామగుండంలోని తబితా ఆశ్రమంలో మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎంఈఓ జింక మల్లేష్, సీడీపీఓ అలేఖ్య పటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.... సమాజంలోని నిరుపేదలు, అనాథలకు సేవలందించే ఇలాంటి కార్యక్రమాలు ఆదర్శప్రాయమని కొనియాడారు. మెడికవర్ ఆసుపత్రి సహకారంతో ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ, మాదిరెడ్డి ఇందుమతి భాస్కర్‌రావు చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు శేషు, నాగేశ్వర్‌రావు, నాగరాజు, లీలా, వంశీ, కావ్య, మద్దెల దినేష్ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు.

ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేష్ మాట్లాడుతూ... నేటి పిల్లలే రేపటి దేశ భవిష్యత్తని, వారికి ఆరోగ్య రక్షణ కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ శిబిరానికి విశేష స్పందన లభించిందని, చిన్నారులకు ఉచిత వైద్య పరీక్షలతో పాటు మందులు, ఎనర్జీ డ్రింక్స్ పంపిణీ చేసినట్లు తెలిపారు. మెడికవర్ ఆసుపత్రి ప్రతినిధులు మాట్లాడుతూ...నిరుపేదలు, అనాథలకు తమ ఆసుపత్రి యాజమాన్యం నిరంతరం ఉచిత వైద్య సేవలు అందిస్తోందన్నారు. గుండె, బీపీ, షుగర్, కంటి సంబంధిత పరీక్షలు, ఈసీజీ తదితర వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ ఆసుపత్రి హెడ్ గుర్రం కిరణ్ ఆదేశాల మేరకు హెల్త్ క్యాంప్ అసోసియేట్ కె. రఘు, ఎంబీబీఎస్ వైద్యుడు ప్రవీణ్, డాక్టర్లు, వైద్య సిబ్బంది, ఐసీడీఎస్ అధికారులు జితేందర్, కనుకరాజ్, ప్రైవేట్ పాఠశాల కరస్పాండెంట్ శివకీర్తి, స్వప్న, ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ సభ్యులు వై. లెనిన్, శ్రీనివాస్, గౌస్, ఆశ్రమ నిర్వాహకులు వీరేందర్ నాయక్, విమల తదితరులు పాల్గొన్నారు.

# ప్రజారోగ్య పరిరక్షణకు ఎన్టీపీసీ మరో ముందడుగు

- **ప్రాజెక్టు ప్రభావిత గ్రామాలు, రామగుండం మున్సిపల్ డివిజన్లకు 500 బస్తాల బ్లీచింగ్ పౌడర్ పంపిణీ**
- **డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల నివారణే లక్ష్యం**
- **సీఎస్ఆర్ కార్యక్రమాలతో ప్రజా సంక్షేమానికి ఎన్టీపీసీ అండ**

**పెద్దపల్లి బ్యూరో, జూన్ 30 (డీడీ9 వార్త):**

సామాజిక బాధ్యత సి ఎస్ ఆర్ కార్యక్రమాల్లో భాగంగా ఎన్టీపీసీ రామగుండం ప్రజారోగ్య పరిరక్షణకు మరో కీలక కార్యక్రమాన్ని చేపట్టింది. సుమారు 25 ప్రాజెక్టు ప్రభావిత గ్రామాలతో పాటు రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లకు సుమారు 500 బస్తాల బ్లీచింగ్ పౌడర్‌ను పంపిణీ చేసింది. వర్షాకాలంలో పరిశుభ్రతను మెరుగుపరచడం, పారిశుధ్య చర్యలను బలోపేతం చేయడం,దోమల వ్యాప్తిని అరికట్టడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఎన్టీపీసీ అధికారులు తెలిపారు. బ్లీచింగ్ పౌడర్ వినియోగంతో డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు తదితర సీజనల్ వ్యాధుల వ్యాప్తిని తగ్గించడంలో స్థానిక సంస్థలకు ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

గ్రామాలు, కాలనీల్లో డ్రైనేజీలు, నీరు నిల్వ ఉండే ప్రాంతాలు, ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రదేశాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టేందుకు ఈ బ్లీచింగ్ పౌడర్ ఉపయోగపడనుంది. స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీలు, మున్సిపల్ అధికారులు ఈ పంపిణీ ద్వారా మరింత సమర్థవంతంగా శానిటేషన్ కార్యక్రమాలు నిర్వహించే అవకాశం కలుగుతుందని తెలిపారు.

ప్రజా సంక్షేమం, ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణకు ఎన్టీపీసీ నిరంతరం కట్టుబడి ఉందని, భవిష్యత్తులో కూడా సమాజాభివృద్ధికి తోడ్పడే సీఎస్ఆర్ కార్యక్రమాలను కొనసాగిస్తామని ఎన్టీపీసీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా పరిసర ప్రాంతాల ప్రజలకు ఆరోగ్యకరమైన, సురక్షితమైన జీవన వాతావరణం కల్పించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు.





# అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి: వెంకన్న

**జనగామ, జూన్ 30 (డిడి 9 వార్త) బ్యూరో:**

స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని ధర్మసాగర్, వేలేరు మండలాల్లో ఇందిరమ్మ ఇళ్ల తొలి విడత కేటాయింపులో అర్హులను విస్మరించారని ఆరోపిస్తూ, రెండో విడతలో పార్టీలకతీతంగా నిజమైన నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేయాలని బీజేపీ నేత పెరుమాండ్ల వెంకటేశ్వర్లు (వెంకన్న) హన్మకొండ జిల్లా కలెక్టర్, ఆర్డీఓలకు వినతిపత్రం సమర్పించారు. అర్హులైన కుటుంబాలను గుర్తించి న్యాయంగా ఇళ్ల కేటాయింపులు చేపట్టాలని ఆయన కోరారు.





# ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ వేగవంతం చేయాలి: ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

- **ఇంచార్జ్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే**
- **అర్హులైన ప్రతి ఓటరు నమోదు అయ్యేలా క్షేత్రస్థాయిలో పని చేయాలని ఆదేశం**

**పెద్దపల్లి బ్యూరో, జూన్ 30 (డీడీ9 వార్త):**

భారత ఎన్నికల కమిషన్ చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతిపై రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో డివిజన్, గ్రామాల ఇంచార్జ్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రతి ఇంటికి చేరుకుని ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు వివరాలు తప్పనిసరిగా నమోదు అయ్యేలా అధికారులు, ఇంచార్జ్‌లు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన పత్రాల సేకరణలో పూర్తి సహకారం అందించాలని, ప్రతి డివిజన్, గ్రామంలో రోజువారీ పురోగతిని పర్యవేక్షిస్తూ నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.

ఈ సమావేశంలో ఇంచార్జ్‌లు తమ పరిధిలో జరుగుతున్న ఎస్.ఐ.ఆర్ కార్యక్రమం పురోగతిని ఎమ్మెల్యేకు వివరించారు.

కార్యక్రమంలో నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# "సేవ్ మణుగూరు" బంద్ విజయవంతం..

- **స్వచ్ఛందంగా బంద్ పాటించిన వ్యాపార వర్గాలు, విద్యా సంస్థలు.**
- **అఖిలపక్షం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ..**

**మణుగూరు.జూన్ 30(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు సింగరేణి ని కాపాడాలని, పికె ఓసీ డిప్ సైడ్ బ్లాక్ ను సింగరేణి కే అప్పగించాలని, ఓపెన్ కాస్ట్ విస్తరణకు అనుమతులను తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సేవ్ మణుగూరు అంటూ అఖిలపక్షం ఆధ్వర్యంలో మంగళవారం నాడు తలపెట్టిన మణుగూరు పట్టణ బంద్ విజయవంతం అయింది. అఖిలపక్ష రాజకీయ పార్టీల నాయకులు, కార్మిక సంఘాల నేతలు, పట్టణ వ్యాపారస్తులు, విద్యా సంస్థలు, అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. అఖిలపక్ష నాయకుల ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ పరిరక్షణ కోసం,మణుగూరు ప్రాంత అభివృద్ధి కోసం భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సింగరేణి సంస్థ ప్రయోజనాలను కాపాడాలని లేని పక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని అఖిలపక్ష నాయకులు హెచ్చరించారు.





# భువనగిరి సమరభేరిని సక్సెస్ చేయాలి

- **సీనియర్ జర్నలిస్టును ఆహ్వానించిన టిఆర్పి నాయకులు**

**డీ డీ 9 వార్త, ములుగు :**

భువనగిరిలో జులై 5వ తేదీన తీన్మార్ మల్లన్న ఆధ్వర్యంలో జరిగే సమరభేరి మహాసభను విజయవంతం చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు తవిటి దిలీప్ కుమార్ అన్నారు. మండలంలోని ఎల్లారెడ్డి పల్లె గ్రామంలో సీనియర్ జర్నలిస్ట్ బేతి సతీష్ ను కలిసి సభకు రావాల్సిందిగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన వెంట టిఆర్పి నాయకులు, మహిళా నాయకులు తదితరులు ఉన్నారు.



# గ్యాస్ సరఫరా అక్రమాల పై దృష్టి సారించి పాత విధానంలోనే సరఫరా పునరుద్ధరించాలి..

- **ఏరియా టిబిజికెయస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు.**

**మణుగూరు,జూన్ 30 (డి డి 9వార్త)**

దేశవ్యాప్తంగా వంట గ్యాస్ సంక్షోభం పూర్తిగా ముగిసి సాధారణ పరిస్థితులు నెలకొన్నప్పటికీ, సింగరేణి కాలరీస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ద్వారా మణుగూరు సింగరేణి ఏరియా కార్మికులకు అందిస్తున్న హెచ్‌పీ గ్యాస్ సరఫరాలో నెలకొన్న అవ్యవస్థ ఇప్పటికీ కొనసాగుతోందని, దీంతో కార్మిక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని మణుగూరు ఏరియా టిబిజికెఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు ఆరోపించారు.

మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, దేశంలో గ్యాస్ సంక్షోభం తీవ్రంగా ఉన్న సమయంలో కార్మికులకు రావాల్సిన గ్యాస్ సిలిండర్లను గ్యాస్ ఏజెన్సీలో పనిచేసే కొందరు నిర్వాహకులు పక్కదారి పట్టించి లక్షల రూపాయల అవినీతికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. ఆ వ్యవహారంపై విచారణ కొనసాగుతున్నప్పటికీ, గ్యాస్ సరఫరాలో అక్రమాలు, డోర్ డెలివరీ పేరుతో ఆర్థిక దోపిడీ ఇప్పటికీ కొనసాగుతోందని ఆయన ఆరోపించారు.

గతంలో గ్యాస్ బుకింగ్ వ్యవధి 21 రోజులు ఉండేదని, గ్యాస్ సంక్షోభ సమయంలో దానిని 45 రోజులకు పెంచడంతో కార్మిక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని గ్యాస్ సబ్సిడీ నష్టపోతున్నారని తెలిపారు. ప్రస్తుతం పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చినందున పాత విధానాన్ని వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

గ్యాస్ బుక్ చేసిన 24 గంటల్లోపు సిలిండర్ సరఫరా చేయాలనే నిబంధన ఉన్నప్పటికీ, ఆ నిబంధన మణుగూరు సింగరేణి ఏరియా లో అమలు కావడం లేదని, బుకింగ్ చేసిన వినియోగదారులు రోజుల తరబడి గ్యాస్ కోసం ఎదురు చూడాల్సి వస్తోందని గ్యాస్ వచ్చేసరికి రిజిస్ట్రేషన్ గడువు ముగుస్తుందని మరల గ్యాస్ సిలిండర్ కోసం రిజిస్ట్రేషన్ చేయవలసి వస్తుందని తెలిపారు హెచ్‌పీ గ్యాస్, భారత్ గ్యాస్ వినియోగదారులు ఇద్దరూ ఈ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

గ్యాస్ ఏజెన్సీల వద్ద తగిన నగదు నిల్వలు లేక పోవడంతో భారత్ గ్యాస్ డిపాజిట్ నిధులను హెచ్‌పీ గ్యాస్ అవసరాలకు వినియోగిస్తున్నారని, దాని భారం కార్మికులపై పడుతూ వారు ఆర్థికంగా, మానసికంగా నష్టపోతున్నారని ఆరోపించారు.

జూన్ 20 నుంచి జూన్ 29 వరకు హెచ్‌పీ గ్యాస్ కోసం 890 మంది కార్మిక కుటుంబాలు బుకింగ్ చేసుకోగా, వారంలో కేవలం 81 సిలిండర్లు మాత్రమే సరఫరా చేశారని తెలిపారు. మిగిలిన కుటుంబాలు గ్యాస్ కోసం నిరీక్షిస్తుండటంతో రోజురోజుకు సమస్య మరింత తీవ్రమవుతోందని, పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా లేక కార్మిక కుటుంబాలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నాయని పేర్కొన్నారు.

మణుగూరు పీవీ కాలనీ గ్యాస్ ఏజెన్సీ వద్ద సిలిండర్ల కోసం వినియోగదారుల మధ్య వాగ్వివాదాలు జరగని రోజు లేదని, గ్యాస్ పంపిణీ వ్యవస్థపై సంబంధిత అధికారులు వెంటనే ప్రత్యేక దృష్టి సారించి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని



కోరారు. గ్యాస్ సిలిండర్ల సరఫరాను పారదర్శకంగా నిర్వహిస్తూ, పాత విధానంలోనే బుకింగ్, పంపిణీ వ్యవస్థను పునరుద్ధరించాలని, కార్మిక కుటుంబాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని నాగెల్లి వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను విజ్ఞప్తి చేశారు.



## రానున్న వర్షా కాలం దృష్ట్యా ముందస్తు చర్యలపై మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే పాయం సమీక్షసమావేశం..

**మణుగూరు.జూన్ 30(డి డి 9వార్త)**

రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మణుగూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం నాడు మణుగూరు మున్సిపాలిటీ పరిధికి సంబంధించిన వర్షాకాల సన్నాహక చర్యలపై మున్సిపల్ కమిషనర్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,వర్షాకాలంలో పట్టణ ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పట్టణంలోని ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్ల మరమ్మతులను వేగవంతం చేయాలని, వర్షపు నీరు నిల్వ కాకుండా కాలువలు, డ్రైనేజీలను పూర్తిస్థాయిలో శుభ్రపరచాలని ఆదేశించారు. మురుగునీటి పారుదల వ్యవస్థ సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవడంతో పాటు పారిశుద్ధ్య కార్యక్రమాలను మరింత ముమ్మరం చేయాలని సూచించారు. ముంపుకు గురయ్యే ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని, అవసరమైన యంత్రాలు, సిబ్బందిని ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని అధికారులకు తెలిపారు.ప్రజలు ఇబ్బందులు పడకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. వర్షాకాలంలో ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి శాఖ సమన్వయంతో పనిచేసి ముందస్తు చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ అధికారులు, ఇంజినీరింగ్ విభాగం అధికారులు, పారిశుద్ధ్య విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గుట్ట మల్లారం రైతు వేదికలో రైతు భరోసా సంబరాలు..

- **సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అభినందనలు**
- **ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన నాయకులు.**

**మణుగూరు.జూన్ 30 (డి డి 9వార్త)**

తెలంగాణ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా పథకాన్ని ప్రారంభించి అర్హులైన రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయాన్ని జమ చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టడం హర్షణీయమని పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక నియోజకవర్గం, మణుగూరు మండలంలోని గుట్ట మల్లారం రైతు వేదికలో నిర్వహించిన రైతు భరోసా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని రైతులను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వర్షాకాల సాగుకు అవసరమైన పెట్టుబడి సకాలంలో రైతులకు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా నిధులను విడుదల చేస్తోందన్నారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, చిన్న, సన్నకారు రైతులకు ప్రాధాన్యతనిస్తూ రైతు భరోసా పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు.పినపాక నియోజకవర్గంలోని అర్హుడు అయిన ప్రతి రైతు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. రైతులు ఎలాంటి సందేహాలు ఉన్నా వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని, ప్రభుత్వం అన్ని విధాలుగా రైతులకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు..

- **ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ పరిసర ప్రాంతాలను శుభ్రం చేయిస్తున్న ప్రజా ప్రతినిధులు.**

**మణుగూరు.జూన్ 30 (డి డి 9వార్త)**

భద్రాద్రి జిల్లా,మణుగూరు మండలం, సమితి సింగారం గ్రామపంచాయతీ పరిధి, 1వ వార్డులో గల ప్రభుత్వ ఏరియా 100 పడకల ఆసుపత్రి పరిసర ప్రాంతాలను పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు మంగళవారం జెసిబి మిషన్ ద్వారా ఆసుపత్రి పరిసర ప్రాంతాలను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా సమితి సింగారం గ్రామపంచాయతీ సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్‌లు మాట్లాడుతు వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఆసుపత్రి ప్రాంగణాన్ని కూడా ఎప్పటికప్పుడు శానిటైజేషన్ చేస్తూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ సూపరింటెంట్ డాక్టర్ గౌరీ ప్రసాద్ గారు,కాంగ్రెస్ పార్టీ నాయకులు భాగం రవి, వత్సవాయి కొండబాబు, శ్రీనివాస్, భద్రయ్య, రాంబాబు, అశోక్ నగర్ యూత్ సభ్యులు నిఖిల్ చారి, రవి తదితరులు పాల్గొన్నారు.





## గిరి లక్ష్మి సొసైటీ కి ఇసుక ర్యాంపు కేటాయించి రెండు గిరిజన సొసైటీల మధ్య వివాదాన్ని పరిష్కరించాలి..

**మణుగూరు.జూన్ 30 (డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక మండలం,దుగినేపల్లి పంచాయతీ లోని వీరాపురం గిరి లక్ష్మి గిరిజన సొసైటీ కి ఇసుక ర్యాంపు కేటాయించి రెండు గిరిజన సొసైటీల మధ్య వివాదాన్ని పరిష్కరించాలని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపందా) మణుగూరు డివిజన్ కార్యదర్శి ఆర్. మధుసూదన్ రెడ్డి సంబంధిత అధికారులను, ప్రజాప్రతినిధులను డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పినపాక మండలం లోని దుగినేపల్లి ఉమ్మడి పంచాయతీ పరిధిలోని వీరాపురం ఇసుక ర్యాంపు గిరి లక్ష్మి గిరిజన సొసైటీ పేరుతోటి దుగినేపల్లి, చేగర్షల తదితర గ్రామాల గిరిజనులు ఉమ్మడిగా ర్యాంపును నిర్వహించుకునే వారని దానిపై వచ్చిన ఆదాయాన్ని అందరూ సమానంగా పంచుకునే వారని కాలక్రమంలో జరిగిన పరిణామాల నేపథ్యంలో గిరి లక్ష్మి గిరిజన సొసైటీ గా, శ్రీరామ గిరిజన సొసైటీగా రెండు సొసైటీలు ఏర్పడ్డాయన్నారు. రెండు గిరిజన సొసైటీలలో శ్రీరామ గిరిజన సొసైటీ కి ఇసుక ర్యాంపు కేటాయించి, గిరి లక్ష్మి గిరిజన సొసైటీ కి ర్యాంపు కేటాయించకపోవడం వలన రెండు గిరిజన సొసైటీల మధ్య వివాదం మొదలైందన్నారు. గత 15




రోజులుగా జరుగుతున్న వివాదం చిలికి చిలికి గాలి వాన లాగా తయారయి సోమవారం ఒకరిపై ఒకరు భౌతిక దాడులు చేసుకునే దాకా వెళ్ళిందన్నారు. ఇరు వర్గాలు కూడా గాయపడ్డారన్నారు. ఈ వివాదం ఇంకా తీవ్ర రూపం దాల్చకముందే సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి గిరి లక్ష్మి గిరిజన సొసైటీ కి కూడా ఇసుక ర్యాంపును కేటాయించి రెండు గిరిజన సొసైటీల మధ్య వివాదాన్ని పరిష్కరించాలని, శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పాలని కోరారు.

## లక్ష్మీనగరం గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన తహసీల్దార్...


**జూన్ 30 డిడి9 వార్త వెంకటాపురం.**

మండలంలోని లక్ష్మీనగరం గిరిజన ఆశ్రమ పాఠశాలను స్థానిక తహసీల్దార్ ఎం. వేణుగోపాల్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో మొత్తం 325 మంది విద్యార్థులు నమోదు కాగా, కేవలం 143 మంది మాత్రమే హాజరుకావడంతో మిగిలిన 182 మంది గైర్హాజరుపై సిబ్బందిని వివరణ కోరారు. కుటుంబాల్లో శుభకార్యాలు, ఇతర వ్యక్తిగత కారణాల వల్ల విద్యార్థులు పాఠశాలకు రాలేదని సిబ్బంది తెలిపారు.

అనంతరం తహసీల్దార్ మధ్యాహ్న భోజన శాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యత, మెనూను స్వయంగా పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకుని, భోజనంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

హైస్కూల్‌కు మంజూరైన 18 టాయిలెట్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి అవగాహన కల్పించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు.





## మహిళలు ఆర్థిక, సామాజిక, రాజకీయంగా ఎదగాలి

- **టీ ఆర్ పి ములుగు జిల్లా నాయకులు**

**డీ డీ 9 వార్త, ములుగు :**


మహిళలు సామాజిక ఆర్థిక రాజకీయ రంగాల్లో ఎదగాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు దిలీప్ కుమార్ అన్నారు. మండలంలోని నల్లగొండ గ్రామంలో ఉన్న మత్స్య సహకార సంఘం మహిళ విభాగం అధ్యక్షురాలు ఏల సావిత్రి, కార్యదర్శి గుండ్ల రమలను ఆయన కలిసి భువనగిరి మహాసభకు ఆహ్వానించారు. ఆయన వెంట తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు ఉన్నారు.

## విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలి.

- **సర్పంచ్ పోరిక సరిత.**

**ఏటూరునాగారం, జూన్ 30(డిడి9 వార్త).**

మండలం లోని రాంనగర్, లంబాడితండా గ్రామాల విద్యార్థులు విద్యాభ్యాసం కొరకు రామన్నగూడెం పాఠశాలకు మరియు ఏటూరునాగారం కళాశాలకు వెళ్లేందుకు బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని మంగళవారం నిర్వహించిన డయల్ యువర్ డిఎం కార్యక్రమంలో వరంగల్ డిపో మేనేజర్ రవిచందర్ తో కోయగూడా ఎల్లాపూర్ సర్పంచ్ పోరిక సరిత శ్రీను ఫోన్లో సమస్యను విన్నవించారు. దీనిపై స్పందించిన డిఎం రవిచందర్ ఈ సమస్యను అతి త్వరలోనే పరిష్కరించి విద్యార్థులకు రవాణా కష్టాలు తీరుస్తానని ఆయన హామీ ఇచ్చారు. తమ గ్రామ సమస్యలను ఎప్పటికప్పు



డు తెలుసుకొని పై అధికారులతో చర్చలు జరిపి సమస్యలను తీర్చడంలో ముందున్న సర్పంచ్ సరిత శ్రీను లను గ్రామస్తులు అభినందిచారు.

## ఆదివాసీ అస్తిత్వంపై పరిశోధనలు కొనసాగిస్తాం

- **సమ్మక్క సారలమ్మ ఆర్కియాలజీ జాయింట్ డైరెక్టర్ బుగ్గ కోటేశ్వరరావు**

**తాడ్వాయి మండలం జూన్ 30 (డిడి9 వార్త)**

ములుగు జిల్లా తాడ్వాయి మండలం ఆదివాసి జాతి అస్తిత్వం కోసం నిరంతరం పురావస్తు మరియు రాతి చిత్రాలు పురాతన కట్టడాలు కోయ ఇలవేల్పులు నాయక పోడు ఇలవేల్పులు గోండుల ఇలవేల్పులు పరిశోధనలు నిత్యం కొనసాగిస్తామని సమ్మక్క సారలమ్మ ఆర్కియాలజీ రీసెర్చ్ ఇనిస్ట్యూట్ జాయింట్ డైరెక్టర్ బుగ్గ కోటేశ్వరరావు తెలిపారు నేడు కామారంలోని సమ్మక్క సారలమ్మ ఆర్కియాలజీ రీసెర్చ్ ఇనిస్ట్యూట్లో జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు గత పది రోజుల ముందు ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా (ASI) న్యూఢిల్లీ వారు మేము చేస్తున్న పరిశోధనలు గుర్తించి కోయ తెగ 50 వేల్పుల చరిత్రను అధికారికంగా మీ ఇన్స్టట్యూట్ నుంచి పంపించాలని సింధు నాగరికత మూలం కోయ సమాజ సాంస్కృతిక పడిగ బొమ్మల చిహ్నాలతో దగ్గర పోలికలు ఉన్నట్లుగా మీరు ఇచ్చిన రిపోర్ట్ ఆధారంగా గుర్తించినట్టు తెలిపారు త్వరలో అధికారికంగా ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా బృందం మేడారం సమ్మక్క సారలమ్మ తల్లులను దర్శించుకుని మా ఇన్స్టిట్యూట్ బృందంతో సింధు లిపిపై చర్చించ నున్నట్లు తెలిపారు భారత ఉపఖండంపై కోయ జాతి చరిత్ర అతి పురాతనమైనదని కానీ కోయ జాతిని బాహ్య సమాజం హీనమైన సమాజంగా చూస్తుందని భారత దేశ మొదటి పరిపాలకులు నాగరికత నేర్పినవారు ఈ సమాజ సృష్టికర్తలు కోయలే అని నిరూపించడమే మా పరిశోధన లక్ష్యమని అది అంతిమ దశకు చేరిందని కోటేశ్వరరావు పేర్కొన్నారు ఈ పరిశోధన సమావేశంలో పరిశోధన కేంద్రం పౌండర్ డా.మైపతి అరుణ్ కుమార్ కోఆర్డినేటర్ సోడే శ్రీరామ్ ఆలం సుధీర్ కలివేటి పవన్ పోలేబోయిన దిలీప్ గొంది రాకేష్ గట్టుపల్లి అర్జున్ కుంజ కృష్ణ ప్రసాద్ కొమరం రవి తదితరులు పాల్గొన్నారు



# గ్రామాల్లో ఆర్ఎంపిలు, ల్యాబ్ నిర్వాహకుల ఇష్టా రాజ్యం

- **తూతూ మంత్రంగా తనిఖీలు**
- **చూసి చూడనట్టు వ్యవహరిస్తున్న జిల్లా వైద్య అధికారులు...?**

**మంగపేట జూన్ 30డీడీ 9 వార్త**

మంగపేట మండలంలోని పలు గ్రామాల్లో ఆర్ఎంపిలు, ల్యాబ్ నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా చేస్తున్న వైద్యం పై జిల్లా వైద్య అధికారుల తనిఖీలు కేవలం తూతూ మంత్రంగానే ముగుస్తున్నాయనే విమర్శలు తరచూ వినిపిస్తున్నాయి. నిబంధనలు ఉల్లంఘించే ఆర్ఎంపిలు, ల్యాబ్ నిర్వాహకుల పై నామమాత్రపు చర్యలు తీసుకోవడం, లేదా ముందస్తు సమాచారం ఇచ్చి తనిఖీలు చేయడం వల్ల క్షేత్రస్థాయిలో ఎలాంటి మార్పు కనిపించడం లేదని ప్రజలు, ప్రజాసంఘాలు ఆరోపిస్తున్నాయి.ఆకస్మికంగా జరగాల్సిన తనిఖీల గురించి ముందే లీకులు ఇవ్వడం లేదా సమాచారం అందించడం వల్ల ఆర్ఎంపిలు, ల్యాబ్ నిర్వాహకులు అప్రమత్తమై లోపాలనుకప్పిపుచ్చుకుంటున్నారు అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.గతంలో వివిధ పత్రికల్లో వచ్చిన కథనాలకు జిల్లా వైద్య అధికారులు పట్టించుకోకపోవడం వెనుక అంతర్యం ఏమిటో? అనే సందేహాలు వినిపిస్తున్నాయి.

**నామమాత్రపు జరిమానాలు**

లైసెన్సులు లేకుండా నడుస్తున్నా లేదా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఆర్ఎంపిలు, ల్యాబ్ నిర్వాహకులు, మెడికల్ షాప్ లపై కఠిన చర్యలు (లైసెన్స్ రద్దు చేయడం వంటివి) తీసుకోకుండా కేవలం సాధారణ నోటీసులు జారీ చేసి



చేతులు దులుపుకుంటున్నారు.అనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.

**ఫిర్యాదులపై స్పందన లేకపోవడం:**

రోగులు లేదా బాధితులు స్పష్టమైన ఆధారాలతో ఫిర్యాదులు చేసినా, అధికారులు పెద్దగా స్పందించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.ఉన్నత స్థాయి అధికారులు ఆకస్మిక దాడులు (సర్ప్రైజ్ ఇన్స్పెక్షన్లు) నిర్వహించి, రోగులకు అందుతున్న వైద్య సేవలను స్వయంగా పరిశీలిస్తేనే వైద్య విధానంలో పారదర్శకత వస్తుంది అని ప్రజలు అంటున్నారు.



# ప్లాస్టిక్ నివారణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలి...

- **డిఎల్పిఓ సాయిబాబా...**

**డిడి9 వార్త, తూప్రాన్**

ప్రతి గ్రామంలో అందరూ సహకరించి ప్లాస్టిక్ నియంత్రణ చేసి తడి చెత్త పొడి చెత్త వేరు చేసి ప్రతి కుటుంబం పరిశుభ్రత పాటిస్తే దేశమంతా కాలుష్యరగతంగా మారుతుందని డిఎల్పిఓ సాయిబాబా తెలిపారు. మంగళవారం నాడు మనోహరాబాద్ మండల పరిధిలోని ముప్పిరెడ్డిపల్లి గ్రామంలో గ్రామ సభకు హాజరైన ఆయన ఈ విషయంపై మాట్లాడుతూ ప్రతి వ్యక్తి కుటుంబాన్ని నీటుగా చూసుకుంటే గ్రామంతో రాష్ట్రం దేశం బాగుపడుతుందని తెలిపారు. సర్పంచ్ రాజనర్సింహ కార్యదర్శి ప్రియాంక ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సపరేటు పారిశుద్ధ డ్రమ్ములను డ్వాక్రా మహిళ గ్రూపులకు వార్డు సభ్యులకు ప్రత్యేక నిబంధనలు విధిస్తూ పారిశుద్ధంపై ప్రత్యేక దృష్టి చూపెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# సీసీ కెమెరాలు నిఘా నేత్రాలు మేడారంలో సీసీ కెమెరాలు ఏర్పాటు

- **సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన ప్రజలను అభినందించిన ఎస్సై కమలాకర్**

**తాడ్వాయి మండలం జూన్ 30 (డిడి9 వార్త)**

ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం జంక్షన్లో ప్రజలు, భక్తుల సౌకర్యార్థం ఎస్పీ సుధీర్ రామనాథన్ కేకన్ ఆదేశాల మేరకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు నార్లాపూర్ ఎస్ఐ అచ్చ కమలాకర్ తెలిపారు. మేడారంలో గతంలో తరచుగా దొంగతనాలు చోటు చేసుకోవడం, రోడ్డు ప్రమాదాలు జరగడం ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని మంగళవారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. వారాంతపు సెలవులలో మేడారంలో భక్తుల రద్దీ పెరగడం, వాహనాల రాకపోకలను నియంత్రించడానికి సీసీ కెమెరాలు. దోహదపడతాయని అన్నారు. ప్రజల భద్రత, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఏర్పాటుచేసిన ఈసిసికెమెరాలు పరిరక్షించు



కోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. అలాగే మేడారం జంపన్న వాగులో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని భవిష్యత్తులో జంపన్న వాగు వరకు సీసీ కెమెరాలు విస్తరించాలనే ఆలోచనలో ఉన్నట్లు ఎస్సై తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన ప్రజలను ఈ సందర్భంగా ఎస్సై అభినందించారు.

# రైతులు పండించిన ప్రతి పంటను కొనుగోలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

- **రైతులు పండించిన ప్రతి పంటను కొనుగోలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.**
- **జొన్నల కొనుగోలు చేయాలని రైతులతో కలసి ధర్నా....**
- **అధికారులు స్పష్టమైన హామీ ఇచ్చే వరకు కలెక్టరేట్‌ను వీడేది లేదు....**
- **మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్ రెడ్డి.**
- **జొన్నలు కొనకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వంటావార్పు: హెచ్చరిక.**

**మెదక్ జూన్ 30 (డీడీ9 వార్త)**



జొన్నలు పండించిన రైతులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదని, రైతులు పండించిన ప్రతి పంటను కొనుగోలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, అధికారులు స్పష్టమైన హామీ ఇచ్చే వరకు కలెక్టరేట్‌ను వీడబోమని, ప్రభుత్వం స్పందించకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వంటావార్పు చేపట్టి రైతుల తరపున ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని మాజీ డిప్యూటీ స్పీకర్ ఏం పద్మ దేవేందర్ రెడ్డి హెచ్చరించారు. మెదక్ జిల్లా రామాయంపేట మండలంలోని దంతేపల్లి, కాట్రియల, పర్వతాపూర్, కిషన్ తండా, జాప్లా తండా గ్రామాలకు చెందిన రైతులు జొన్నల కొనుగోలును వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మెదక్ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట బైఠాయించి మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి రైతులతో కలసి ధర్నా నిర్వహించి సంఘీభావం ప్రకటించారు. జొన్నలను కొనుగోలు చేసిన అనంతరం మట్టి పెల్లలు ఉన్నాయనే కారణంతో మార్క్‌ఫెడ్ అధికారులు తిరిగి వెనక్కి పంపడాన్ని నిరసిస్తూ రైతులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ రైతులు ఎంతో కష్టపడి పండించిన జొన్నలను ప్రభుత్వం కొనుగోలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. ఇప్పటికే కొనుగోలు చేసిన జొన్నలను నాణ్యత పేరుతో, మట్టి పెల్లలు ఉన్నాయనే సాకుతో తిరిగి రైతులకే అప్పగించడం వల్ల రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో ఫోన్‌లో మాట్లాడి పూర్తి వివరాలు తెలియజేసినట్లు తెలిపారు. మార్క్‌ఫెడ్ అధికారులు జొన్నలను తిరిగి పంపిన విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. జొన్నల కొనుగోలుపై అధికారులు స్పష్టమైన హామీ ఇచ్చే వరకు కలెక్టరేట్ కార్యాలయం నుంచి కదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతుల నుంచి జొన్నలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని, ప్రభుత్వం స్పందించకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట వంటావార్పు కార్యక్రమం నిర్వహిస్తూ రైతుల పక్షాన ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది జొన్న పంట సాగు చేసిన రైతులు మార్కెట్‌లో సరైన ధర లేక, ప్రభుత్వ కొనుగోళ్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతులు పండించిన ప్రతి పంటను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. మట్టి పెల్లలు ఉన్నాయనే కారణంతో జొన్నలను తిరస్కరించడం సమంజసం కాదన్నారు. గతంలో మొలకలు వచ్చిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేసిన విషయాన్ని గుర్తు చేస్తూ, అదే విధంగా జొన్నలను కూడా వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. జొన్నల కొనుగోలులో జరుగుతున్న జాప్యం వల్ల రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారని, ప్రభుత్వం ఇకనైనా స్పందించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం మార్క్‌ఫెడ్ డిఎం, బాలకృష్ణ డిఆర్ఓ అంబదాస్ జొన్నలు కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ ధర్నాలో వివిధ గ్రామాలకు చెందిన రైతులు, మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ అరేళ్ళ.మల్లికార్జున్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్.కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు చౌదరి. సుప్రభాత రావు, రామాయంపేట మున్సిపల్ కౌన్సిలర్ చౌదరి చరిత, బిఆర్ఎస్, నాయకులు ఎస్కే అహ్మద్. ఉమామహేశ్వర్, శ్యామ్, స్మోకింగ్, నవీన్, దోమకొండ శ్రీను, అస్నుద్దిన్, విజయ భాస్కర్ రెడ్డి, సత్యపాల్, కిషన్ బాబు, సంతోష్, శ్రవణ్ గౌడ్, మహేష్, శ్రీకాంత్, నర్సింగరావు, మెదక్ పట్టణ నాయకులు లింగారెడ్డి ప్రభు రెడ్డి, మోచి. కిషన్, ఇందాద్, సాయి, కిరణ్, ఎంబీపూర్ మహేష్, స్వామి నాయక్, వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచ్ లు, తదితరులు పాల్గొన్నారు.





# 'గో టూ విలేజ్' కార్యక్రమంతో మాదిగ యువతలో విద్యా చైతన్యం పెంపు...

- **జూలై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని మాదిగ జాతి పండుగగా జరుపుకోవాలి...**

**జూన్30 డిడి9 వార్త వెంకటాపురం.**

వెంకటాపురం నూగూరు మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో 'గో టూ విలేజ్' కార్యక్రమాన్ని మండల అధ్యక్షుడు యాసం రమేష్ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు పుల్లూరు కరుణాకర్ మాదిగ అధ్యక్షత వహించగా, రాష్ట్ర ఉపాధ్యక్షులు, ములుగు జిల్లా ఇన్చార్జ్ చాతల రమేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మాదిగ సామాజిక వర్గంలో విద్యార్థుల డ్రాప్అవుట్‌లను తగ్గించి, విద్యా అవకాశాలను అందిపుచ్చుకునేలా చైతన్యం కల్పించేందుకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో 40 రోజుల పాటు 'గో టూ విలేజ్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో యువతతో సమావేశాలు నిర్వహిస్తూ విద్య ప్రాధాన్యత, అక్షరాస్యత పెంపు, ఉన్నత విద్య అవకాశాల పై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు.

ఎస్సీ వర్గీకరణ సాధనలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చేసిన కృషిని కొనియాడుతూ, ఆ ఫలితాలను సద్వినియోగం చేసుకుని మాదిగ యువత విద్య, ఉద్యోగ రంగాల్లో మరింత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. జూలై 7న జరగనున్న ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రతి గ్రామంలో జెండా గద్దెల నిర్మాణం చేసి, జెండా ఆవిష్కరణలతో మాదిగ జాతి పండుగగా ఘనంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఏలుపుల మల్లేష్ మాదిగ, ఎంఎస్పీ మండల అధ్యక్షుడు కొండారి సత్యం మాదిగ, చెన్నం గౌతం మాదిగ, గుగ్గిళ్ల కళ్యాణ్ మాదిగ, బోట్ల వంశి మాదిగ, చెన్నం దివాకర్ మాదిగ, బొంతల వెంకటేశ్వర్లు మాదిగతో పాటు పలువురు నాయకులు, యువకులు పాల్గొన్నారు.

# ఖరీఫ్‌లో రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యం: ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**జనగామ జూన్ 30 (డీడీ9 వార్త)బ్యూరో**

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఖరీఫ్ సీజన్‌లో ఒక్క ఎకరం పంట కూడా ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి నీటిపారుదల అధికారులను ఆదేశించారు.

హనుమకొండలోని చింతగట్టు నీటిపారుదల చీఫ్ ఇంజినీర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రతి రైతుకు సాగునీరు అందేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు.

జూలై 1 నుంచి నెల రోజుల పాటు దేవాదుల ఫేజ్ 1, 2, 3 మోటార్లను నిరంతరాయంగా నడిపి రిజర్వాయర్లకు నీటిని సరఫరా చేయాలని, జూలై 15 నుంచి కాలువల ద్వారా పంట పొలాలకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

గత రబీ సీజన్‌లో గోదావరి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా జనగామ జిల్లాలో రికార్డు స్థాయి దిగుబడులు సాధ్యమయ్యాయని గుర్తుచేసిన ఆయన, అదే తరహాలో ఖరీఫ్‌లోనూ ముందస్తు ప్రణాళికతో సాగునీటి పంపిణీ నిర్వహించాలని సూచించారు.

రిజర్వాయర్లు, చెరువులు, కుంటలను సాధ్యమైనంత మేర నింపడం, గ్రౌండ్ లెవెల్‌లో పర్యవేక్షణ పెంచడం ద్వారా రైతుల పంటలను కాపాడాలని అధికారులకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి సూచించారు. "రైతుల సంక్షేమమే ధ్యేయం.. ఖరీఫ్‌లో పంటల రక్షణే ప్రధాన లక్ష్యం" అని ఆయన పేర్కొన్నారు.






# పౌర హక్కుల పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

- **అవగాహన సదస్సులో డిప్యూటీ తాసిల్దార్ లక్ష్మణ్**

**బోనకల్, జూన్ 30,(డీడీ9 వార్త):**

మండల పరిధిలోని జానకిపురం గ్రామంలో మంగళవారం షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ, గ్రామ సర్పంచ్ కర్లకుంట సులోచన దావీదు ఆధ్వర్యంలో పౌర హక్కుల పరిరక్షణ సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ తహసిల్దార్ అజ్మీర లక్ష్మణ్ హాజరయ్యారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌర హక్కుల పరిరక్షణ చట్టం 1955 మరియు ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం 1989 పైన అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఎస్సీ ఎస్టీలపై ఇంకా కొన్ని చోట్ల దాడులు జరుగుతూనే ఉన్నాయి. కొన్నిచోట్ల గ్రామ బహిష్కరణ జరుగుతున్నది. వారిని అంటరానివారిగా ఏదో తప్పు చేసిన వారిగా చూస్తున్నారు.స్వాతంత్రం వచ్చి 74నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా ఇంకా ఇలాంటి దురాచారాలు కొన్నిచోట్ల కనబడుతూనే ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు మరియు పరిరక్షణకు సంబంధించి కూలంకషంగా వివరించారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎన్నో విజయాలు సాధించిన మానవ సమాజం ఎంతో వికాసము పొందింది. రాజ్యాంగం అమలులోకి వచ్చి67 సంవత్సరాలు అయినా కూడా సాటి మనిషిని మనిషిగా చూడలేకపోవడం, గౌరవించే లేకపోవడం, హింసించడం, వంటివి ఎంతో అవివేకంతో కూడిన పనులు. ఇలాంటి పనులు చేయకూడదు చేసేవారిని ప్రోత్సహించకూడదు. ఒకవేళ ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే బాధితులకు జిల్లా ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి పరిరక్షణశాఖ అండగా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె శ్రీనివాస్ సోషల్ వెల్ఫేర్ వార్డెన్ కె వెంకటేశ్వర్లు,బోనకల్ వార్డెన్ వినోద,జానకీపురం క్లస్టర్ హెడ్ కానిస్టేబుల్ వాల్యా,రిటైర్డ్ ఉద్యోగులు కర్లకుంట దావీదు జిపిఓ కరిముల్లా,సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.


# హీరోయిన్ల విషయంలోనూ దర్శకనిర్మాతలు నమ్మకం చూపించాలి



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత చాలా కాలం తర్వాత 'మా ఇంటి బంగారం' సినిమాతో వచ్చి బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నారు. ఈ చిత్రం జూన్ 19న థియేటర్స్‌లోకి రాగా.. మొదటి షో నుంచి భారీ కలెక్షన్లు రాబట్టడంతో పాటుగా ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. థియేటర్స్‌లో దూసుకుపోతూ.. పలు రికార్డులు క్రియేట్ చేస్తున్న 'మా ఇంటి బంగారం'తో సామ్ కంబ్యాక్ ఊహించని స్థాయికి చేరుకుందని చెప్పాలి. కానీ అంతలోనే ఆమె మళ్లీ ఒక బ్రేక్ తీసుకుంటున్నట్లు ప్రకటించి అభిమానులను నిరాశ పరిచారు. సామ్ తల్లి కాబోతుండటంతో కొంతకాలం సినిమాలకు బ్రేక్ ఇవ్వనున్నారు. ఇదిలా ఉంటే.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సమంత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇండస్ట్రీలో లేడీ ఓరియెంటెడ్ సినిమాలు హిట్ అయినా.. వర్కింగ్ అవర్స్, రెమ్యునరేషన్ విషయాల్లో వివక్ష ఎందుకుంటుంది? అనే విషయంపై సమంత స్పందిస్తూ.. "పని వేళలు,మెరుగైన పారితోషికం కోసం ఇప్పటికీ హీరోయిన్లు పోరాడాల్సి వస్తోంది. ఇది ఒక రోజులో మారేది కాదు. మగ సూపర్ స్టార్లు ఒక్క రోజులో పుట్టరు.

వారిని దేవుడిలా చూపించడానికి దర్శకులు, నిర్మాతలు ఎంతో సమయం, శ్రమ పెడతారు. ప్రతి సినిమాతో వారి ఇమేజ్‌ను బిల్డ్ చేస్తారు. కానీ, దురదృష్టవశాత్తు మహిళా నటీమణుల విషయంలో ఆ శ్రమ, సమయం కేటాయించరు. మేకర్స్ హీరోయిన్లను కూడా సూపర్ స్టార్లుగా మార్చడానికి అంతే టైమ్, ఇన్వెస్ట్‌మెంట్ పెడితే.. అది ఖచ్చితంగా సాధ్యమవుతుంది. హీరోయిన్ల విషయంలోనూ ఆ నమ్మకం చూపించాలి " అని సమంత అభిప్రాయపడ్డారు. అలాగే సోషల్ మీడియా నెగిటివిటీ గురించి చెబుతూ.. "ఈ రోజుల్లో మన చుట్టూ ఉండే జనాలు, సోషల్ మీడియా కామెంట్స్ మన నిర్ణయాలను మార్చేస్తున్నాయి. దీనివల్ల మన మనసులో ఏముందో, మనకు ఏం కావాలో బయటకు చెప్పలేకపోతున్నాం. పక్కవారి అభిప్రాయాలను, వారి ఆలోచనలను మనవిగా నమ్మే ప్రమాదం ఉంది. అందుకే నేను ఈ గొడవలకు దూరంగా ఉండటానికి మెడిటేషన్ , ప్రశాంతమైన ప్రదేశాలకు వెళ్లడం చేస్తుంటాను. మనల్ని మనం కాపాడుకోవడానికి ఇది చాలా అవసరం" అని సమంత చెప్పుకొచ్చారు.

## అంత కష్టపడి పని చేసినప్పుడు మన కోసం మనం ఖర్చు పెట్టుకోవడంలో తప్పు లేదు




టాలీవుడ్ యంగ్ హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ గత కొద్ది కాలంగా ఫ్లాపులతో సతమతమవుతున్న ఈ భామ గత ఏడాది 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నారు. ఈ భారీ విజయంతో మళ్లీ ఫామ్‌లోకి వచ్చిన ఐశ్వర్య.. వరుస అవకాశాలతో ఫుల్ బిజీగా గడుపుతున్నారు. ప్రస్తుతం ఐశ్వర్య రాజేష్ ఓ సుకుమారితో బిగ్ స్క్రీన్‌పై సందడి చేయనున్నారు. అలాగే 'ఇసాకపట్నం' అనే క్రైమ్ థ్రిల్లర్ సిరీస్‌తో ఓటీటీ ప్రియులను అలరించనున్నారు. అయితే ఈ సిరీస్ జూలై 2 నుంచి అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ అందుబాటులోకి రానుంది. ఇప్పటికే ఈ సిరీస్‌కు సంబంధించిన అప్డేట్స్ సోషల్ మీడియాలో భారీ బజ్‌ను క్రియేట్ చేశాయి. విడుదల తేదీ దగ్గరపడుతుండటంతో.. ప్రమోషన్స్ జోరు పెంచిన ఓ ఇంటర్వ్యూలో భాగంగా ఐశ్వర్య తన వ్యక్తిగత అలవాట్ల గురించి ఒక ఆసక్తికరమైన విషయాన్ని పంచుకున్నారు. సినిమా కోసం అంతలా కష్టపడినప్పుడు మనకు మనం బహుమతులు ఇచ్చుకోవడం చాలా ముఖ్యమని ఆమె చెప్పుకొచ్చారు. "నేను నటించే ప్రతి సినిమా పూర్తయ్యాక నాకు నేను ఒక గిఫ్ట్ కొనుక్కుంటాను. అంత కష్టపడి పని చేసినప్పుడు మన కోసం మనం ఖర్చు పెట్టుకోవడంలో తప్పు లేదు" అని ఐశ్వర్య స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే తన లైఫ్‌లో కొనుక్కున్న అత్యంత ఖరీదైన గిఫ్ట్ గురించి చెబుతూ.. "నా కెరీర్‌లోనే అత్యంత ఎక్స్‌పెన్సివ్ గిఫ్ట్ ఒక లగ్జరీ వాచ్. దాని ధర అక్షరాలా 15 లక్షల రూపాయలు. 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా పెద్ద హిట్ అయ్యాక.. ఆ చిత్రానికి వచ్చిన రెమ్యునరేషన్‌తో ప్రత్యేకంగా ఈ వాచ్ కొనుక్కున్నాను" అని వెల్లడించారు. ఐశ్వర్య చేసిన ఈ కామెంట్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ఒక వాచ్ కోసం అంత భారీ మొత్తంలో ఖర్చు పెట్టడంపై నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఆ బ్రాండెడ్ వాచ్‌లో ఏదో ఒక స్పెషాలిటీ ఉండే ఉంటుందని కామెంట్లు పెడుతున్నారు.

# ఆ అసంతృప్తి ఎప్పుడూ లేదు!



"మొదట్నుంచీ నా దగ్గరకు వచ్చిన పాత్రకి న్యాయం చేయడంపైనే నా దృష్టి ఉండేది. అంతే తప్ప... ఫలానా పాత్రని చేయలేకపోయానే అనే అసంతృప్తి నాలో ఎప్పుడూ లేదు. సానుకూల ఆలోచనలతోనే నా నట, వ్యాపార ప్రయాణం సాగింది'' అన్నారు ప్రముఖ నటుడు మురళీమోహన్. సినీ, వ్యాపార, రాజకీయ, సేవా రంగాల్లో తనదైన ముద్రవేసిన ఆయన ఇటీవలే కేంద్ర ప్రభుత్వం నుంచి పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం ఫిల్మ్ క్రిటిక్స్ అసోసియేషన్ సంస్థ మురళీమోహన్‌ను సన్మానించింది. అనంతరం నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో మురళీమోహన్ మాట్లాడారు. "అనుకోకుండా నటుణ్ని అయ్యాను. అట్లూరి పూర్ణచంద్రరావు, మాణిక్యాలరావు, దాసరి నారాయణరావు తదితరుల ప్రోత్సాహంతో నా నట ప్రయాణం కొనసాగింది. 60 ఏళ్ల వరకూ కథానాయకుడిగా చేశా. ఆ తర్వాత నా వయసు రీత్యా సహాయ పాత్రలపై దృష్టిపెట్టా. అయితే అప్పటికీ నేను హీరోలాగే కనిపించడంతో అనుకున్న స్థాయిలో క్యారెక్టర్స్ రాలేదు. అప్పుడు వ్యాపార రంగంపై దృష్టిపెట్టా. కథానాయకుడు శోభన్‌బాబు ఇచ్చిన సలహాతో రియల్ ఎస్టేట్ వ్యాపారంలోకి అడుగుపెట్టి రాణించా. నీతి, నిజాయతీలే పెట్టుబడిగా ఒక్క తప్పు కూడా జరగకుండా చూసుకున్నా. ఎన్ని వ్యాపారాలు చేసినా సరే, ఏ రంగంలోనూ నాపై మచ్చ పడలేదు. ఇప్పటికీ సాధారణ జీవితాన్నే గడుపుతుంటా''నని చెప్పారు మురళీమోహన్.

# టాలీవుడ్‌పై కన్నేసిన శనయా కపూర్..



బాలీవుడ్ నటుడు సంజయ్ కపూర్ కూతురిగా ఇండస్ట్రీకి వచ్చిన శనయా కపూర్ తన గ్లామర్‌తో ఫుల్ ఫేమ్ రాబట్టుకున్నారు. గత ఏడాది 'ఆఖోంకి గుస్తాకియా' అనే రొమాంటిక్ డ్రామాతో హీరోయిన్‌గా మారిన ఆమె ఇటీవల 'తు యా మై' అనే సర్వైవల్ థ్రిల్లర్ చేసింది. అయితే, నటిగా ఆమెకు మంచి గుర్తింపు వచ్చినప్పటికీ, ఈ రెండు సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో సక్సెస్ కాలేకపోయాయి. ఈ నేపథ్యంలో బాలీవుడ్‌లో సరైన బ్రేక్ కోసం చూస్తున్న శనయా కపూర్, ఇప్పుడు టాలీవుడ్‌పై కన్నేసినట్లు వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం తెలుగు చిత్రాలకు దేశవ్యాప్తంగా భారీ మార్కెట్ ఉండటంతో శనయా కపూర్ టాలీవుడ్ ఎంట్రీ కోసం గట్టిగానే ప్రయత్నాలు చేస్తున్నారట. ఈ క్రమంలోనే ఆమె తెలుగులో ఒక క్రేజీ ఆఫర్‌ను సొంతం చేసుకున్నట్లు సమాచారం. టాలీవుడ్ యంగ్ హీరో తేజ సజ్జా కెరీర్‌లో మైలురాయిగా నిలిచిన చిత్రం 'జాంబీ రెడ్డి'. ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో వచ్చిన ఈ వినూత్న చిత్రం బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచింది. అయితే ఇప్పుడు ఈ సూపర్ హిట్ చిత్రానికి సీక్వెల్‌గా 'జాంబీ రెడ్డి2' తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ హైవోల్టేజ్ సీక్వెల్ సినిమాలో హీరోయిన్‌గా శనయా కపూర్‌ను ఎంపిక చేసినట్లు టాక్. ఈ చిత్రంలో ఆమె పాత్ర చాలా విభిన్నంగా ఉండబోతోందని తెలుస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటోంది. 'జాంబీ రెడ్డి' మొదటి భాగం ప్రేక్షకులను ఏ స్థాయిలో భయపెడుతూనే నవ్వించిందో.. ఈ పార్ట్2 కూడా అంతకు మించి ఉండేలా ప్లాన్ చేస్తున్నారట మేకర్స్. అయితే ఈ క్రేజీ ప్రాజెక్ట్ ద్వారా శనయా కపూర్ టాలీవుడ్‌లోకి అడుగుపెడితే, ఆమె కెరీర్‌కు ఇక్కడ గట్టి బ్రేక్ దొరికే అవకాశం ఉందని నెటిజన్లు చర్చించుకుంటున్నారు.



## అబ్బాయిలు, అమ్మాయిలు అనే తేడా లేకుండా అందరికీ కనెక్ట్ అవుతుంది

కోలీవుడ్ యంగ్ బ్యూటీ కాయదు లోహర్ 'డ్రాగన్' సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్‌ను తన ఖాతాలో వేసుకున్నారు. ఇటీవల ఫంకీ, పల్లి చట్టంబి వంటి చిత్రాలు చేసినప్పటికీ అమ్మడు ఆశించినంత స్థాయిలో మెప్పించలేకపోయారు. అయినప్పటికీ కాయదుకు వరుస అవకాశాలు వస్తున్నాయి. తెలుగు, తమిళ ఇండస్ట్రీలో స్టార్ హీరోల సరసన చాన్స్ దక్కించుకుంటున్నారు. టాలీవుడ్‌లో నేచురల్ స్టార్ నాని సరసన 'ది ప్యారడైజ్' చిత్రంలో నటిస్తున్న కాయదు.. కోలీవుడ్‌లో 'ఇమ్మోర్టల్', 'ఇదాయం మురళి' చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. అథర్వ మురళి హీరోగా, ఆకాష్ బాస్కరన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఇదాయం మురళి' చిత్రానికి ఎస్.ఎస్. తమన్ సంగీతం అందిస్తున్నారు. శరవేగంగా షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం జూలై 10న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది.

ఈ నేపథ్యంలో చిత్ర ప్రమోషన్స్‌లో పాల్గొన్న కాయదు లోహర్ ఈ సినిమా గురించి పలు ఆసక్తికర విశేషాలను పంచుకున్నారు. సినిమా జర్నీ గురించి కాయదు లోహర్ మాట్లాడుతూ.. "నేను నా జీవితంలో మొదటిసారి చెన్నైకి వెళ్ళింది ఈ 'ఇదాయం మురళి' సినిమా కోసమే. దాదాపు మూడు, నాలుగు సంవత్సరాల క్రితమే నేను ఈ ప్రాజెక్ట్‌కు సంతకం చేశాను. ఇంత అద్భుతమైన టీమ్‌తో కలిసి పనిచేయడం నాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. నా మొదటి తమిళ చిత్రం కావడం వల్ల అంతా చాలా సజావుగా, పర్ఫెక్ట్‌గా సాగిపోయింది" అని చెప్పారు. కథ గురించి చెబుతూ.. "ఈ చిత్రంలోని కథ అబ్బాయిలు, అమ్మాయిలు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అవుతుంది. తమిళ చిత్ర పరిశ్రమలో వన్ సైడ్ ప్రేమకథగా నిలిచిపోయిన ఐకానిక్ మూవీ 'ఇదయం' వాతావరణాన్ని ఈ సినిమా ద్వారా పునఃసృష్టించడానికి చిత్ర బృందం ప్రయత్నించింది. పాత్రల మధ్య ఉండే నిజమైన, వాస్తవిక సంబంధాలను ఇందులో చాలా చక్కగా చిత్రీకరించారు" అని ఆమె పేర్కొన్నారు.

# 'హైలెస్సో' నుంచి పవర్ ఫుల్ లుక్ విడుదల చేసిన మేకర్స్

ఒకప్పుడు లవర్ బాయ్‌గా ఫ్యామిలీ హీరోగా నటించి మెప్పించిన శివాజీ ఇప్పుడు క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా మారి వైవిధ్యమైన పాత్రలు చేస్తూ ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తున్నారు. సెకండ్ ఇన్నింగ్స్‌లో విలన్‌గానూ నటిస్తున్నారు. గత ఏడాది కోర్ట్, దండోరా వంటి చిత్రాలతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న శివాజీ ప్రస్తుతం వరుస సినిమాలు చేస్తూ బిజీగా గడుపుతున్నారు. త్వరలోనే 'సుత్తిని సుద్దపూసిని' అనే చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న శివాజీ, ఇప్పుడు మరో క్రేజీ ప్రాజెక్ట్‌లో కీలక పాత్ర దక్కించుకున్నారు. బుల్లితెరపైనే కాకుండా వెండితెరపై కూడా తనకంటూ ప్రత్యేక ఇమేజ్ క్రియేట్ చేసుకున్న యంగ్ హీరో సుడిగాలి సుధీర్ నటిస్తున్న భారీ యాక్షన్ డ్రామా 'హైలెస్సో' . ఈ సినిమాలో శివాజీ ఒక పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. నేడు ఆయన పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ.. సినిమాలో ఆయన క్యారెక్టర్‌కు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ సినిమాలో శివాజీ 'లైలం బాబు' అనే ఒక పవర్‌ఫుల్, కాకరేపే పాత్రలో కనిపించనున్నట్లు వెల్లడించారు. విడుదలైన బర్త్‌డే పోస్టర్‌లో శివాజీ లుక్ చాలా రగ్గడ్‌గా, వినూత్నంగా ఉంది. బ్లాక్ అండ్ వైట్ డ్రెస్ వేసుకుని, మెడలో పులిగోరు ధరించి, చేతిలో గోలీసోడా బాటిల్ పట్టుకుని తీవ్రమైన ఆగ్రహంతో చూస్తున్న ఆయన పోజ్ మాస్ ఆడియన్స్‌ను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఈ పోస్టర్ చూస్తుంటే సినిమాలో శివాజీ క్యారెక్టర్ ఎంత పవర్‌ఫుల్‌గా ఉండబోతోందో అర్థమవుతోంది. కాగా.. ప్రసన్న కుమార్ కోట దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో నటాషా సింగ్, నక్ష శరణ్, అక్షర గౌడ హీరోయిన్లుగా నటిస్తున్నారు. వజ్ర వారాహి సినిమాస్ బ్యానర్‌పై శివచెర్రీ, రవికిరణ్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అనుదీప్ దేవ్ ఈ చిత్రానికి స్వరాలు సమకూరుస్తున్నారు. మైథలాజికల్ టచ్‌తో కూడిన పక్కా రూరల్ మాస్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న 'హైలెస్సో' చిత్ర షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి, ఈ సినిమాను ఈ ఏడాది చివరలో గ్రాండ్‌గా విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.



# 'మకుటం'తో నెరవేరిన కోరిక



'శివ' చూసిన తర్వాత దర్శకుడిగా మారాలనుకున్నా, 'మకుటం' సినిమాతో ఇన్నాళ్లకు ఆ కోరిక నెరవేరిందన్నారు విశాల్. ఆయన కథానాయకుడిగా నటిస్తూ, దర్శకత్వం వహించిన చిత్రమే 'మకుటం'. అంజలి, దుషార విజయన్ కథానాయికలు. సూపర్‌గుడ్ ఫిల్మ్స్ పతాకంపై దివంగత ఆర్.బి.చౌదరి నిర్మాతగా రూపొందుతున్న చిత్రమిది. ఈ చిత్రంలోని 'నచ్చాకే వచ్చారా... గుండెల్లో పెట్టుకో... ' అంటూ సాగే పాటని ఇటీవల హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఓ వేడుకలో విడుదల చేశారు. జి.వి.ప్రకాశ్‌కుమార్ స్వరకల్పనలోని ఈ గీతాన్ని భువనచంద్ర రచించగా, ప్రభ ఆలపించారు. విశాల్ మాట్లాడుతూ "నిర్మాత ఆర్.బి.చౌదరి తన 99వ ప్రాజెక్ట్ బాధ్యతల్ని నా చేతుల్లో పెట్టారు. ఆయన నమ్మకాన్ని నిలబెట్టుకున్నాననే అనుకుంటున్నా. ఆయన పరిచయం చేసిన దర్శకుల్లో నేను 45వ వ్యక్తిని. ఈ చిత్రం ఓ మంచి అనుభూతిని పంచుతుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో జితన్ రమేశ్, అజయ్, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500201. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502510.